Bommareddi Venkata Red[dy]
105
Teleprolu
2u-10

శ్రీ

సావిత్రి నాటకము

4 అంకముల నాటకము.

పండిత ద్రోణంరాజు సీతారామ విరచితము.

ఏ-జెంటు

కముజర్తి కోటయ్య, బుక్ సెల్లర్, బెజవాడ,

పబ్లిషర్సు ;

రంగా వెంకటరత్నం

బుక్ సెల్లర్సు బెజవాడ.

శ్రీ ... గ్రంథాలయము స్థాపితము 1933 టేలప్రోలు, కృష్ణాజిల్లా

తొమ్మిదవ కూర్పు 1000

1930.

Registered Copy-right]

[వెల రు 1—0—0.

ఏలూరు శ్రీ పాండురంగ ముద్రాక్షరశాల, యందు

ముద్రింపఁబడియె.

విజ్ఞప్తి.

ఆంధ్రమహాజనుల యాదరణమున నీనాటకము తొమ్మిదవ కూర్పుకూడ వెలువడుభాగ్యము లభించినది. ప్రకటనకర్తగారు కోరగా ఐదవ కూర్పులో లేనటువంటి, కొన్నిరంగములు, కీర్తనలు, యిందుచేర్చినాను. ప్రదర్శకులుగాని, చదువరులుగాని, మఱేమైన వలసిన మార్పులంగూర్చి తెలిపినచో దయతో ముందుకూర్పునందు వ్రాయుటకు యత్నించెద.

ఇట్లు,
గ్రంథకర్త.

మొదటికూర్పు — 3000

రెండవకూర్పు — 1000

మూడవకూర్పు — 1000

నాలుగవకూర్పు — 2000

అయిదవకూర్పు — 1000

ఆరవకూర్పు — 1000

ఏడవకూర్పు — 2000

ఎనిమిదవకూర్పు — 2000

తొమ్మిదవకూర్పు — 1000

ఈ నాటకమునందు వచ్చు పాత్రలు

పు రు షు లు

ద్యుమత్సేనుఁడు:—సాళ్వదేశపురాజు.

విశారదుఁడు:—మంత్రి.

చిత్రకేతుఁడు:—ద్యుమత్సేనుని శత్రువు.

సత్యవంతుఁడు:—ద్యుమత్సేనునికొడుకు-కథానాయకుఁడు

అశ్వపతి:—మద్రరాజు.

నారదుఁడు:—ముని.

యముఁడు.

చిత్రగుప్తులు.

సుశర్మ:—సత్యవంతునిహితుఁడు.

స్త్రీ లు

సావిత్రి:—మద్రరాజపుత్రి (కథానాయిక)

భద్రాంగి:—ద్యుమత్సేనునిభార్య.

నర్మద:—సావిత్రి చెలికత్తె.

శ్రీరామ

[illegible]

సావిత్రి నాటకము.

ప్రథమాంకము.

(౧)

రంగము——సాళ్వపురము

(ప్రవేశము:——చిత్రకేతుఁడు)

చిత్ర——(స్వగతము; ద్యుమత్సేనుని సైన్య మల్పసంఖ్యగలదై యుండి నను నాసేనతోఁ గడుధైర్యమున వెన్నిడక పోరాడుచున్నది. (ఎదుటజూచి) ఏదియో కోలాహలము వినవచ్చుచున్నది. మా సేనల కేమియు హానివాటిల్లి యుండదుకదా! (బిగ్గఱగా) ఓహో సేనానాయకులారా!

చ. మనమున నించుకేని యను ♦ మానముబూనక శత్రువర్గముం
దునిమి ధరాతలంబునను ♦ దోరపుగీర్తిఁ గొనంగ సాళ్వనా
థుని మదినున్న గర్వమును ♦ ద్రొక్కను (ఎదుటజూచి)

అదిగో! సాళ్వసైన్యము లన్నియు నలుదెసలఁ బఱుగిడుచున్నవి. ఈసమయమున ద్యుమత్సేనుఁ డెక్కడికైనఁ బలాయింతుడగునేమో. అట్లయిన నాకీవిజయమువలన సంతోష మంతయెక్కుడుగనుండదు.

(సేనలవంకఁజూచి)

వీరవరేణ్యులార ! యీ
జనపతి నెట్టులైనఁ గడు ♦ సాహసమేర్పడఁ బట్టి తెండిటన్.

(పరికించి) ఆహా ! ఏమి నా సేనాధిపునిశౌర్యము ! వర్ణనాతీతమై యున్నది. నాయాజ్ఞకు పూర్వమే యాతఁడు ద్యుమత్సేనుని బంధించి

యిట్లు దొంగగా నివచ్చుచున్నాఁడు. సేనాపతీ ! మేలు మేలు నీయద్వితీయమైన రాజభక్తికి సంతసించితిని.

(బంధింపఁబడిన ద్యుమత్సేనునితో సేనానాయకుడు ప్రవేశించును)

సేనా—(చిత్రకేతునిఁజూచి) దేవా ! దేవరవారి వైరియగుద్యుమత్సేన మహారాజితఁడే.

చిత్ర—దండనాయకా ! ఇంకను నీతనికా మహారాజ శబ్దమేల?

ద్యు—(తనలో) ఆహా! కాలమహిమ! (పరమేశ్వరు నుద్దేశించి)

మ. చతురంభోధిపరీత భూతలమహా ♦ సామ్రాజ్యభారంబునా
యతబాహాయుగళంబునన్ నిలిపి ధ ♦ ర్మైకస్థితింబోల్చు భూ
పతి నీరీతిని చేసి యొక్కరునిచే ♦ బంధింపఁగా జేసితే
యతిచిత్రంబులు నీవిలాసములనం ♦ తా! సర్వలోకేశ్వరా!

ఓ దేవా! యెట్లనుభవింపవలయునని బ్రహ్మ వ్రాసియుండునో యట్లు దప్పదుగదా. నన్ను బంధించుటకన్న జంపియున్న నింతగావిచారింపను.

చిత్ర—(ద్యుమత్సేనునిఁజూచి) ఓహో ద్యుమత్సేనుఁడా యేమి ? ఈ చిత్రకేతునిబలమెట్టిదో యిప్పుడైనఁ దెలిసినదా! నీగర్వమంతయు నడగినదా ! ఇంతకు మున్ను రాజ్యమదాంధత్వమున నన్నుఁ దృణప్రాయునిగాఁ జూచితివే. ఇప్పుడు నీకడ్డమయినవారెవ్వరు

ద్యు—ఓయీ! చిత్రకేతూ! వాయీలేల గర్వాలాపములాడెదవు? రణంబున జయాపజయములు దైవాధీనములు. మా సేనలన్నియు సిద్ధములేని సమయమున దస్కరునివలె వచ్చి పురము ముట్టడించిన నదియును నొకశౌర్యమేనా? నీచే జిక్కిన కారణమున నెట్టిమాటలనైన నాడెదవు. పోటుమానిసివేని నీవు నాతో యుద్ధమొనర్పుము. నీ నా బలంబులు దెలియును.

చిత్ర—(ద్యుమత్సేనునిం జూచి) ఈయనవసర సంభాషణతో మా కేమియుం బనిలేదు. నీరాజ్యము మావశమైనది ఇంక నీవిందుండం జనదు. నేడేనీవు సతీసుతసమేతుండవై పురమువిడిచి పోవలయును తెలిసినదా ! (సేనాపతింజూచి) సేనాపతీ ! ఈతని బంధముల విడిచి, యీతనిం బురినుండి వెడల నడువు ప్రయత్నమున నుండుము. పొమ్ము. (నిష్క్రమించును.)

ద్యు—(తనలో) అక్కటా ! విధాత నాకెట్టి సంకల్పము గల్పించినాడు నిన్న నేటివరకు మహాసంపదల ననుభవించుచు, సకల సౌఖ్యముల నందుచున్న నేను ప్రజలనందర, గన్నబిడ్డలచందమున నరయుచు ధర్మపరిపాలన మాచరింపుచున్న నేను సత్యసంధుడననియు దానధౌరేయుడననియుగీర్తిగొన్న నేను, ఈరాజ్యమువిడిచి యరణ్యముల కాలుబిడ్డలతోం బోవలసినదేనా ! హా ! సాళ్వపు రాజలక్ష్మీ ! లక్ష్మి చంచలచిత్తయనుమాట నేడు సత్యమైనది కాకున్నచోం గ్రూరాత్ముండగుచు శత్రురాజుం జేరుదువా! నేను పురంబువిడువవలసివచ్చినదను సంగతి దెలిసినచో నిరంతరమును ననేక పరిచారికాపరివృతయైయుండు నాయర్ధాంగియు నెన్నండును గ్రిందకాలు బెట్టియెఱుంగని నాచిన్నికొమరుండగు సత్యవంతుండును నంతగాం బరితపింతురో కదా!అహా ! ఎంతకష్టము సంభవించినది !

(నిష్క్రమించును.)

రంగము:—అరణ్యము—(అశ్వపతి ప్రవేశము)

అశ్వ—(తనలో)

మ. అతనిష్ఠం దపమాచరించితిని లో ♦ కారాధ్యునింగూర్చి స
ద్వ్రతముల్ పెక్కులొనర్చితిం జపములన్ ♦ రావిల్లగా సల్పితిన్
గ్రతువుల్ జేసితి నెన్నియో భువిని నే ♦ గానంగ లేకుంటి స
త్సుతుం, నాపాప మదేమొగాని యసలా? ♦ శోకింతు ని[illegible]

నేను జేసిన పుణ్యములన్నియు నేలపాలయినవి. (ఇంచుకయూరకుండి) ఇప్పుడు నేను విచారించినందువలన బ్రయోజన మేమియున్నది లోకమాతయగు సావిత్రింగూర్చి తపమొనర్చెదగాక !

(కనులమూసికొని దపము జేయుచున్నాడు.)

(సావిత్రి—ప్రత్యక్షమగును)

సావి—(అశ్వపతియెదుట నిలిచి) రాజా ! నీతపోనిష్ఠకు నే నెంతయు సంతసించితిని వలయు వరమొసంగెద కోరుము.

అశ్వ—[కనులు దెరచి చూచి) తల్లీ ! సావిత్రీమహాదేవీ! నీదివ్యమంగళ విగ్రహసందర్శనమున నేను కృతార్థుడనైతిని.

సీ. పరమసౌఖ్యవాప్తి ♦ వరతారకాంగణం
బుసకు సుతుండెకదా ♦ వనజవైరి
బహుఘోర సంసార ♦ వారాశి దరియింప
జేయ పుత్రుడెకదా ♦ చెలగు నౌక
శ్రీముక్తినామక ♦ నీమంతినింగూర్ప
తనయుడేకద తగు ♦ తార్పులాడు
సద్వంశవరకీర్తి ♦ శాఖలు వొలయింప
బుత్రుడేకద మేటి ♦ భూరుహంబు

తే. గీ. పుత్రుడేకద సుఖముల ♦ మూలమరయ
నాత్మజుడెగదా దురితల ♦ తా లవిత్రి
డట్టి పుత్రుండు పుట్టలే ♦ దంచు మిగుల
వగల బొగులుచుంటిని నేను ♦ భావమందు

చ. ఎంతధనాఢ్యుడైనను మ ♦ రెంతిగ భూవలయంబు నేలినన్
సంతతి లేనిచో నతని ♦ జన్మనిరర్థకమంచు నేనిదే
స్వాంతమునందు నీచరణ ♦ పద్మములన్ నెరనమ్మినాను నా
వంతను మాన్పి సంతతి న ♦ పారకృపామతి నిచ్చి బ్రోవుమా.

సావి—నరపాలా ! నీ యభీష్టము సిద్ధించుగాక ! సకల పుత్రికారత్నముదయించిసావిత్రియను పేరవర్ధిల్లు. ఆమెవలననీచింతయంతయు దీరును. (అంతర్ధానమగును.)

అశ్వ—(తనలో) జగజ్జనని వచించినపలుకులకు నాస్వాంతమునసంతోషము కలిగినది.

రంగము:—(ఆమందిరములో అశ్వపతి సావిత్రిని ముద్దాడుచుఁ బ్రవేశించును.)

అశ్వ—ఆహా ! నేనిప్పటికి సార్థకజీవుడనైతిని.

తే. గీ. సంతతియెుదవలేదంచు • స్వాంతమందు
పొగిలి పొగిలి పురాకృత • పుణ్యమునను
లీల నేటికి నొకసుపు • త్రీలలామ
గాంచినాడను సావిత్రి • కరుణచేత.

ఇక నీమె దినదిన ప్రవర్ధమానయై తగినవరుని చేపట్టి, సుఖించుచుండఁజూచి యానందించు భాగ్యమెప్పుడు వచ్చునో కదా ! (ఎదుటజూచి) బాలికామణిం గైకొనును.

(నిష్క్రమించును.)

రంగము—(వింధ్యారణ్యప్రదేశమునం దొకవనము. సావిత్రియు జెలికత్తెయగు నర్మదయు బ్రవేశించుచున్నారు.)

సావి—చెలీ! ఎందుకీ వేళాకోళపు మాటలు ? దీనివలనఁ బ్రయోజన మేమియున్నది?

నర్మ—నావి వేళాకోళములా! నేను వివాహము గూర్చిముచ్చటించుట తప్పా ! నీతండ్రిగారు నానా రాజకుమారుల చిత్రపటములను దెప్పించి నీకుఁ జూపించినను అందెవ్వరిని వరింపకయుంటివి. నేని కారణము ?

సావి—నాచిత్త మెవ్వరిపైనను వాలకయుండుటయే దానికగారణము.

నర్మ—ప్రపంచములో నెక్కడనో యే రాజకుమారుడు వచ్చి నిన్ను వరించుననియా నీయభిప్రాయము.

సావి—వెఱ్ఱిదానా! ఈశరీర మెవరికొరకై సృష్టింపబడినదో యెవరుజెప్ప గలరు.

నర్మ——నీవెంత చిత్రముగ మాటలాడుదువు! (ఇంచుకయూరకుండి) చెలీ! మద్రరాజదుహితా! రాత్రి నీవుగన్న కలనెఱిగింపవైతి వికదా! అదివినిపించినంత మాత్రముననే నీ నోరరిగి పోవునా యేమి! ప్రాణసఖినగు నాయొద్దగూడ దాపరికమా?

సావి—నర్మదా నీయొద్ద నెప్పుడైన నేసంగతినైనం దాచితినా?

నర్మ—అట్లయిన వినిపించుట కీసంశయమేల?

సావి—నాకేమియు సంశయములేదు. వినుము, నిన్నరేయి భోజనానంతరమున మాతృమూర్తితో నేదియో సంభాషించుచు గొంత సేపు కూర్చొని యనంతరము నిద్రాదేవతచే నావహింపబడుటచేం దల్పమునం బరుండి యిష్టదేవతా స్మరించుచు నిద్రను మునింగితిని. అప్పుడు నా స్వప్నమునం దొక రాజకుమారుడు—

(సంశయించును)

నర్మ—సంశయించెదవేల? ఇందన్యులెవ్వరును లేరు?

సావి—నన్నేల యీరీతి బలవంతపరచెదవు? అబ్బా!

(నిట్టూర్పు విడుచుచును)

నర్మ—ఆ కలసంగతి జ్ఞప్తికి రాగానే నీకు తాపము గలుగుచున్నదే, అట్లయిన నది సామాన్యపుగల గాదు. వినవలసినదే. సఖీమణీ! సిగ్గుబొందక జెప్పుము.

సావి—అబ్బబ్బా! ఏమి యీబలవంతము! చెప్పెదను వినుము.

సీ. పూర్ణేందు బింబంబు ♦ బోలు మొగమువాడు
కంజాతములనేలు ♦ కనులవాడు
వజ్రపంజరనిభ ♦ వక్షస్థలమువాడు
చిరునవ్వు మోమున ♦ జెలంగువాడు
కమనీయసౌందర్య ♦ కంబు కంఠమువాడు
కరుణార్ద్రహృదయుఁడై ♦ గ్రాలువాడు
గర్వంబు రవయులేక ♦ గాసిలి చెడువాడు
బాహుదీప్తి నిగిడించి ♦ పరగువాడు
తే.గీ. నొక్కచేత సబరిసము ♦ నొక్కచేత
దారువు ధరించి రాజనం ♦ దనుడునయ్యు
మునికుమారుని భంగిని ♦ బొలుచువాడు
సజ్జనుండొకండు నాకు సా ♦ క్షాత్కరించె

నర్మ—అందుకనే కలిగిన నాటనుండియు నీచిత్తము మరియొకవిధమున మారిపోయినది.

సావి—అతనిం గనుంగొని నేనేదియో భాషింప తలంపు చెందగనే యాదివ్యమంగళ విగ్రహము దదృశ్యుఁడయ్యెను. చెలీ నీవు ప్రాణసఖివి గావున జెప్పుచుంటిని. అట్టి జగన్మోహనాకారునే నేనును జూచియుండలేమనుమా. వేయేల నాచిత్తము తదాయత్తమైనది నా మనోరథమంతయు నాతని వశమైనది.

నర్మ—చెలీ నీవింతటి వలపు ఎవ్వనియొక్కనిని గలలోఁ జూచి వానికై బరితపించుచుంటివా ఎవ్వరైన విన్న నవ్వుదురు. నీ తండ్రియు నేక రాజకుమారుల చిత్రపటముల దెప్పించి నీకు జూపించెను. అందెవ్వరు నీకు దగియుండలేదు నీకలలోఁ జూచినపురుషుండు దెంచినిన్న మహామాఁడునని యానీయాన.

సావి—నర్మదా పోనిమ్ము ఆసంగతి యిప్పుడేల భగవదాజ్ఞ యెట్లున్న

నట్లగును మాయమ్మగారు మనకై వేచి యుందు రేమో
త్వరగా బోవుదమా?

నర్మ—మన మిప్పుడేకదా వచ్చితిమి ఇంతలో దత్తరమందెద వేల?

మ. అదియే వింధ్యవనంబు, నల్లదె సిరో ♦ ద్యానం, బదే చూడుమీ
కదలీవాటి యవే మహీజవితతుల్ ♦ కల్హార నీరేజసం
పదరాజిల్లెడు కేళికాసర మదే ♦ వల్లీమతల్లీవశం
వదకుంజంబు లవే గనన్ నయనప ♦ ర్వంబుల్ బొనర్చున్ సఖీ

కావున నించుకసే పచ్చట విశ్రమించి యరుగుదము రమ్మా
(చేయిబట్టుకొని కొంతదూరము దీసికొనిపోయి)

సావి—సఖీ! నర్మదా! ఆహా! ఈవనరామణీయత యెంత స్వాభావికముగనున్నదే! ఇందలి వృక్షపంక్తుల మీదుగా వీచుచున్న యీమంద మలయానిలము డెందముల కెంత యానందము గొలుపుచున్నదో!

నర్మ—ఈవనలక్ష్మి మనయెడల గౌరవముజూపుటకై మనమాసీనుల మగుట కేర్పరచిన రత్నకంబళములో యనునటుల పచ్చిక బయలును దిలకింపుము

(సత్యవంతుడు - ప్రవేశము)

సత్య—(తనలో) ఆహా ఆవ్యాఘ్రము నన్నెంతలో గన్నుగప్పి యిట్లు పరుగెత్తుకొనివచ్చినది. బాల్యమునుండియు నాచేత బెంపబడుచుండు నాముద్దులేడిని వ్యాఘ్రమిధున మొందు పరుముకొని రాగ నయ్యది భయముచేబరుగెత్తుకొని వచ్చి నా వెనుక జేరెను దానిభయమునకు గారణ మేమైయుండునా యని యిటు నటు పరికించునప్పటికి నాకంటికి రెండు పులులు దానిదరుముకొని వచ్చుట గోచరమయ్యె వెంటనే హరిణమును గట్టివేసి యాశ్రమములోని కరిగి విల్లందుకొని యిట్లువచ్చి యాడుపులిని మాత్రము వధి పగలిగితిని. తక్కినదిమాత్రము నావింటిదెబ్బకు నందక

గుఱ్ఱము వసగిరి వచ్చి యేపొదయందో డాగి యున్నది. కానిమ్ము దీనిఁ గూడ వధింపలేకయుందునా. ఏపొదయందు డాగియున్నదో తగు జాగరూకతతో నరసెదగాక ! (ఇంచుక ముందుకు నడచి, సావిత్రి నర్మదల జూచి) ఆహా ! ఈ యువతీమణు లెవ్వరు ! వీరి యపూర్వ సౌందర్య తేజము లీ వనమంతయుఁ బ్రతిఫలింపఁ జేయుచున్నవే !

మ. సురనారీమణులో, భుజంగసతులో ♦ క్షోణీశశుద్ధాంత సుం
దరులో, గారుడయక్షకన్యకలొ, గం ♦ ధర్వాంగనశ్రేష్ఠలో
వరవిద్యాధరవంశసంభవలొ రం ♦ భామేనకా కాంతలో
సరిరా రెవ్వరు వీరికిన్ శుభవిలా ♦ సప్రౌఢవాగ్వైఖరిన్

(పరికించి) ఇందుఁ గుడివేపు ప్రక్కగానున్న యువిద యొక రాజపుత్రి యనియు, రెండవ కాంత యామె చేటికయనియుఁ దోచుచున్నది. అందుకు సందియములేదు భళా! ఏమి! ఆ రాజకుమారి సౌందర్యము!

సావి—(నర్మదను జూచి) చెలీ ! ఇంక మన మేగుదమా ? రెండడుగులు ముందుకు వేయుదము.)

సత్య—అహా !

తే.గీ. విలసితాననంబు శశితో ♦ జెలిమి సేయుఁ
దియ్యపలుకులు తేనెలు ♦ వియ్యమందఁ
నడక లంచల కొంచద ♦ నంబు సేయుఁ
గమలగంధి మనోహరా ♦ కార మొప్పె.

ఇట్టి సౌందర్యరాశి యేమహానుభావునకు జనించి, యేభాగ్యశాలిగృహంబు బావనము సేయుచున్నదో! (ఆలోచించి) కాదు కాదు, ఈమె యవివాహిత. కాకున్నచో నాదృష్టి యిటు మెప్పెఁ బాఱనే బాఱదు. ఈమెను జూచినంతనే నాచిత్త మదియొకతీరునఁ జలించినది. మానసమా ! నీ కీవెఱ్ఱియేమి !

మ. సకలశ్రీయుతమైన రాజ్యము రిపు ♦ క్ష్మానాథుచేఁ బెట్టి, య
య్యకలంకాత్ముని శ్రీశుఁ గొల్చుచు నర ♦ ణ్యంబందున్నట్టి మా

మకరాంకుతన్ బిసగొల్పు నేనిప్పుడు భా ♦ వాగ్రజన్మమున్ జూడ, విం
చుక ధైర్యంబు వహింపలేమి యకటా ♦ చోద్యంబుగాఁ జిత్తమా!
ఏపుణ్యమూర్తి యీకాంతాశిరోవతంసమును వట్యాహంబాడిసౌఖ్య
మూల నందనున్నాఁడో వానిదే జన్మ!

ఉ. ధాత యనేక సుందరుల ♦ ధాత్రిని సృష్టి యొనర్చుచుండె, యా
ధాతకు గర్వభంగమును ♦ దప్పక చేయగ నెంచి టెంచు ల
క్ష్మీశరుణీమణీ బుతువు ♦ జిత్తమునందలపోసి పోసి, య
బ్జాతముఖిన్ సృజించెనని ♦ యాత్మఁ దలంతును చేయు నేటికిన్.

ఏమో కాని సాహసస్సాగక యున్నది. సమీపించి పలుకరింతునా (ఆలోచించి) అట్లు చేసినచో దోషముకదా! అట్లుచేయుకయుంటినేని? వీరి యుదంతము నాకెట్లు తెలియును? అయ్యో! నాకీవెర్రియేమి వీరి వృత్తాంతము నాకుఁ దెలిసిన నేంతలాభమో, తెలియకపోయిన నంతియేలాభము. కావున్నచో రాజ్యభ్రష్టుడ నైన నాకీ చింతయేటికి?

[తెరలోఁ బెద్దధ్వని]

సావి—(శర్మిష్ఠను జూచి) ఏదియో భయంకరమైన వ్యాఘ్రరవము విన వచ్చుచున్నది. నాకు మిక్కిలి భీతి గలుగుచున్నది.

శర్మ—అదిగో! వ్యాఘ్రము మనదెసకే వచ్చుచున్నది.

సావి—అయ్యో! మనకింక నేమి

(ఇద్దరును చెరియొక దెసకు బరుగెత్తుదురు)

సత్య—(ఎదుట జూచి) అదిగో! నా కంటి దెబ్బను తప్పించుకొని పోయిన యీ వ్యాఘ్రము మిగులఁ గోపావేశమున నా తలిరుబోండ్లపై లంఘించుటకై గాబోలునట్లు పరుగెత్తుచున్నది. ఇప్పట్టదానిం దునిమి వారి ప్రాణముల రక్షించెదఁగాక!

(తెరలో)

హా! పులివాతఁబడనున్న నన్ను రక్షించు వారెవ్వరు లేరా!

సత్య—స్వప్రాణ సంరక్షణార్థమై యెవరిమార్గము వారు చూచుకొందురుగదా! ఆమె చెలికత్తె యేదారినో చని యెక్కడనో డాగి యున్నది. ఈమె భయముచే నట్లు కేక వేసినది (బిగ్గరగా)

తే. గీ. వలదు వల దిట్లు భయమందఁ ♦ గలికిమిన్న
స్వార్థ రక్షణశాలినై ♦ యలరు నేను
సత్వరమ్ముగ నేతెంచి ♦ శౌర్యమునను
వ్యాఘ్రమును దున్మి నిన్నుఁ గా ♦ పాడువాఁడ!

(నిష్క్రమించును)

సావి—(ప్రవేశించి తనలో) ఆహా! పులివాతఁబడనున్న సమయమున కరుదెంచి నన్ను రక్షించిన మించిన యాకృపాశాలి యెవ్వరో కదా! ఆతఁడా సమయమునకు రాకయున్నచో నేనీపాటి కంతకాలమున కరిగియేయుందును. ఈపురుషుని జూడఁగా నాకు స్వప్నమందు సాక్షాత్కరించిన వానివలెఁ జూపట్టుచున్నాఁడు. ఇందుల కావంతయు సందియములేదు. ఈ మహారణ్యభూమి కతఁ డేలవచ్చెనో! ఆతఁ డీరీతి తాపసవేషమున నుండుటకేమి కారణమో? వృత్తాంత మరయుటకైన వ్యవధిలేక పోయెనే! వ్యాఘ్రమును దునిమినంతనే యాతఁ డరిగినాఁడు. ఇంక నాకాతని ముఖసందర్శన మబ్బుగాబోలు. కలలోఁ గన్న పురుషుఁడు నేఁడు ప్రత్యక్షముగ సందర్శనంబొసంగెను, గదా యని యెంతయు సంతసించితిని. నాహృదయ మాతని యందు సంపూర్తిగఁ జిక్కినది అక్కటా! ఇప్పుడు నేనేమి సేయుదును! ఆతనిని మరలఁ జూచుట యెట్లు సంభవించును?

(సత్యవంతుఁడు—ప్రవేశించును.)

సత్య—(తనలో) నేనరుగుటయం దొకక్షణ మాలస్యమై యుండెనేని యాపూర్ణేందు వదన యీపాటికి ప్రాణముని విడిచియేయుండును. కాని భగవంతుఁడు నాయందుండుటచే నట్టి యుపాయ మామెకు సంభవింపకుండునట్లు వ్యాఘ్రము నటఁ గూల్చనైనది.

ప్రాణరక్షణం బందిన యాతరుణీమణి యెక్కడ కరిగెనో ! (అటు నిటుఁ జూచి) ఔఁగదుగో ! ఆసీమంతిని యావృక్షముక్రిందఁ దన చెలికత్తెకు గాఁబోలు వేచి యున్నది. సమీపించి యామె యుదంతంబు నడిగెదనుగాక! (సమీపించుచున్నాఁడు.)

సావి—(సిగ్గు నటించి కొంచె మవలకుఁ బోవును.)

సత్య—(తనలో) ఈ లజ్జాభినయ మీమె మోమున కొక యపూర్వమైన సౌందర్యమును దెచ్చినది, ఈమెను పలుకరించెదనుగాక. (ప్రకాశముగా)

తే. గీ. ఇంత సిగ్గేల పొందెదో ◆ యింతి మున్న
వ్యాఘ్రమును దున్మి నిన్నుఁ గా ◆ పాడినట్టి
వాఁడఁ గానొకో నన్ జెర ◆ వాని పగిది
గాంచ ధర్మమె నీకు నో ◆ చంచలాక్షి.

నీక్రీగంటి చూపు లొక్కసారి నాపైఁ బ్రసరింపఁ జేయుము.

సావి—(తనలో) ఆహా ! ఏమి ! ఈతని వాక్కులనుండి యమృతరసం బొలుకుచున్నది. ఇప్పుడు నేనీతనితోడ నేమని భాషింతును ? అయిన నిట్లు బలికెదఁగాక ! (ప్రకాశముగా) పుణ్యపురుషా ! నీవెవ్వరవో నాకుఁ దెలియదు గాని, నాప్రాణసంరక్షణ మాచరించిన నీనిర్హేతుక జాయమాన కరుణకు నే ననేక వందనంబు లర్పించుచున్నాను. (ఇంచుక యూరకుండి) ఆర్తరక్షకుండవగు నీకులగోత్రంబు లెఱుంగఁ దలచిన నన్ను మన్నింతురుగాక !

సత్య—ఇందుముఖీ ! నాకులగోత్రముల కేమి ? విన వచ్చును. ? కాని ముందుగా నీయుదంతంబు నెఱుంగ నాచిత్తము దత్తర మందుచున్నది.

సావి—తే. గీ. మద్రదేశంబు బాలించు ◆ మనుజనాథుఁ
డశ్వపతి యాత్మజాతగా ◆ నవని యందు
ధన్య సావిత్రీవ్రతమునఁ ◆ బడసె నన్ను
వినుము! సావిత్రియను పేరఁ ◆ దనరుదాన.

మాతండ్రిమమ్ము లందఱను వెంట బెట్టుకొని యీవింధ్యారణ్య ప్రదేశమునకు విహారార్థమై యరుదెంచి యిచ్చటికనతిదూరంబునందు విడిసియున్నాఁడు. నేనును జెలికత్తెయు నిట్టీవనంబున కరుదెంచితిమి. నేనుపులినోటఁ బడకుండ నీచేఁ గాపాడఁ బడితిని.

సత్య—(తనలో) ఏమి ! ఈవినయము! ఈ గంభీరవాక్యములు! ఈమెను వీక్షింపుచున్న కొలఁదిని నాచిత్తమంత కంతకు మారవికారము నందుచున్నది. ఈమె యవివాహితకదా ! నాకోరిక యేలవెలి బుచ్చరాదు! ప్రేలిఁబుచ్చినచో నేమగునో! ఈకన్యయెవ్వరికైన నిర్దేశింపఁబడియుండెనేమో ! అట్లయినచో నాకోరికయుత్తదే యగును. కావున నెమ్మదిగా నిట్లడిగి చూచెదఁగాక !(ప్రకాశముగా) తరుణీమణీ ! నిన్నుఁ జెట్టబట్టు ధన్యుండైన పురుషుఁ డెవ్వరో నేనెఱుంగదగునా?

సావి—పురుషవరేణ్యా ! నే నవివాహితను.

సత్య—అట్లయిన నీ వెవ్వరికైన నిర్దేశింపఁబడియుంటివేమో యడుగ వచ్చునా?

సావి—(తనలో) ఈతని ప్రశ్నయందు గూఢార్థము కలదు. ఈతని సుందర ముఖారవిందసందర్శనము జేసినప్పుడే నాడెందమీతని వశమైనది. ఇప్పుడు నేనీతని కేమని ప్రత్యుత్తరమియ్యగలను? (ప్రకాశముగా) నే నెవ్వరికిని నిర్దేశింపబడి యుండలేదు. (క్రిగం [illegible]చూచును.)

సత్య—([illegible]ము) ఈమె నాయభీష్టమీడేరుటకుఁ గొంత యవకాశ మిచ్చినది. కాని నాకోరిక బయలుపెట్టుటకు మాత్రము నాచిత్తము సమ్మతింపకయున్నది.

సావి—(తనలో) ఈతఁడేదియో యాలోచింపుచున్నాఁడు. (ప్రకాశముగా) పురుషవరేణ్యా: నన్నుఁ గూర్చి తెలియఁదగిన విషయములఁ దెలిసికొంటిరి, నీ వృత్తాంతము నేనువినదగునని సెలవొసం గింపగోరెద.

సత్య—అయ్యో ! ఈనిర్భాగ్యుని వృత్తాంతము నీవు తెలుసుకొనఁదలంచు చుంటివా ?

తే॥ గీ॥ వినుము! నేను ద్యుమత్సేన ♦ విభుని సుతుఁడ
సత్యవతుండఁ బేరున ♦ జలరుహాక్షి

సావి— మనుజవిభుని సుతుఁడ వయ్య ♦ ముని విధమున
బరగుచుంటివి విపుల యో ♦ భాసురాంగ॥

సత్య—(తనలో) ఈమె [illegible] చక్కఁగ నడిగి [illegible] కాని దీనికబ్రత్యుత్తర మెట్లీయవలయునో నాకు దెలియకున్నది. (ప్రకాశముగా)

తే॥ గీ॥ బందు లోడలో నోడలు ♦ బందులగును
ననెడు సామెత వినలేద ♦ యతివమిన్న !
కాలపురుషుని చిత్రంబు ♦ గన్గొనంగ
శక్తుఁ డెవ్వడు ధాత్రిపై ♦ జలజనయన !

సావి—(తనలో) ఈతని వాక్యమునందు దినుమంతయు నర్థము నాకుగోచరమగుటలేదు. ఎమైన నేమి ! నా కితఁడే మనోవల్లభుఁడు గావలయును.

[తెరలో]

సావి ! సావిత్రీ ! సావిత్రీ !

సత్య—(స్వగతము) ఈమె నన్వేషించువారు వెలికిత్తెంచుచున్నది. ఇప్పుడీమె రాక మానంభాషణ కంతరాయము గలిగించునుగదా ?

సావి—(ఎదుటజూచి) అదిగో! నర్మద యిట్లువచ్చుచున్నది.

నర్మ—(ప్రవేశించి సావిత్రినిఁజూచి) ప్రాణసంరక్షణ మాచరించుకొని బ్రతికియుంటివా? అమ్మయ్య! ఇంక బోవుదము రమ్మా.

[తెరలో]

సత్యవంతా ! సత్యవంతా !

సత్య— (తనలో) ప్రియపితఁ డెవరు [illegible] పుడు గా బోయి వచ్చుచున్నాడు

గాలవుడు— (ప్రవేశించి సత్యవంతునిఁ జూచి) స్నేహితుఁడనవగా నీవే స్నేహితుఁడవు ఈరోజున నాతోఁ జెప్పకుండగ యొంటరిగావచ్చితి వేమి (ఎదుటజూచి) వీరెవ్వరు! ఈ సుదతీమణు లిచ్చటి కెట్లు వచ్చిరి? స్త్రీలు పురుషులచూపులకు వ్యాఘ్రస్వరూపములవలె గన్పట్టుదురుసుమా! (సమీపించి) ఏగ్రామమమ్మా మనది

సావి— భూసురోత్తమా ! నేను మద్రరాజదుహితను వనమునకుఁ జెలితో నరుదెంచి పులివాతఁబడనుండఁగా మీరాజపుత్రునిచేత రక్షింపబడితిని.

గాల— (తనలో) ఏదో కాస్సడిగినది (ప్రకాశముగా) (సత్యవంతుని జూచి) పాపము ! నీవీమెకుఁ బ్రాణదాన మిచ్చితివా! సరే ఇక పోదము రమ్ము ఆలస్యమైనచో వ్యాఘ్రాదులు ముసురును (చేయి పట్టుకొని లాగుచున్నాడు.)

సత్య— మిత్రమా! తొందరపడవలదు ఇదిగో ! వచ్చుచున్నాను.

నర్మ— (తనలో) ఈ సావిత్రి మొగము జూడగా నీతనితో సంభాషించి నట్లు దోచుచున్నది ఈమె చూపులన్నియు నాతనిపైననే ప్రసరింపచేయుచున్నది (ప్రకాశముగా) సావిత్రీ! ఆలస్యమేల చేసెదవు ఇంతసేపుమున్న నన్ను రమ్మని తొందరపెట్టితివే ఇప్పు డింటికి పోవుట కిష్టమువచ్చుటలేదాయేమి

సావి— ఏమే! నీపరిహాసవాక్యములు! (స్వగతము) నన్ను రమ్మన యీ చెలి తొందరపెట్టుచున్నది. అక్కటా! ఈతనివిడిచి [illegible] కలసి వచ్చినదే కానిమ్ము ఈతఁడు ద్యుమత్సేనుని సుతుఁడని [illegible] సత్య వంతుఁడనియు దెలిసెనుగదా!

సావి— (స్వగతము) ఈతనిని విడిచిపోవుటకుగాళ్ళాడకున్నవి. అయినను వచ్చెదను ఇదిగో! వచ్చుచుంటి

తే॥ గీ॥ ప్రాణముల గాచినట్టి నీ ♦ పరమకరుణ
మరువజాలను బోయెద ♦ మాననేంద్ర!
దైవ మనుగూర్పఁ దగనేని ♦ దప్పకేను
నిన్నుఁగూడి సుఖంబుల ♦ నెగడఁగలను
(సత్యవంతునిజూచి జెలితో నిష్క్రమించును)

సత్య—(సావిత్రింజూచుచు)(తనలో) అదిగో! ఆకన్యామణియేగుచున్నది.
తే॥ గీ॥ తనదుచిత్తము నామీఁద దగిలెననుచు
దెలుపఁ గాబోలు వెనుకకు ♦ దిరిగి దిరిగి
చూచుచును బోవుచుండెను ♦ సుదతి యామె
చూపు లిప్పు డనంగుని తూపులయ్యె॥

అక్కటా! అవిరిబోడి యరిగినది ఈ సంపూర్ణ పూర్ణిమా చంద్రమండలమును ధిక్కరించు మొగంబును నేనెన్నఁడైన మరల గందునా అట్టి భాగ్యము నాకున్నదో లేదో! ఇంకను నా సుందరీమణి నాతో నేమి సంభాషించియుండునో గదా! ఆమె చెలికత్తెయు నాహితుడగు గాలవుడును మాయెడ బాటునకు గారణులైరి (సావిత్రినుద్దేశించి) హా సుదతీమణీ! నీపైఁ జిక్కిన నాచిత్తము నెట్లు మరల్చుకొందును

గాల—ఏమయ్యా! మిత్రమా: నీకేమో తాపము గలుగుచున్నట్లున్నదే ఇప్పుడడిగిన యాస్త్రీపిశాచ మేమైన సోకినదా యేమి చూడగా నట్లేయున్నది రమ్ము రమ్ము అరణ్యమునఁ దపోవృత్తినున్న నీకుఁ స్త్రీప్రపంచగోష్ఠి యెందుకు

సత్య—హా! సావిత్రీ! సావిత్రీ!
తే॥ గీ॥ ఇట్టెయరుదెంచి మరుల నా ♦ కట్టెగొలిపి
యరిగితివి నీదుదారిని ♦ నంబుజాక్షి
దారి కాన్పింప దేదారి ♦ దరలువాడ
మరల ననుఁజూచు భాగ్య మే ♦ మాడ్కిఁగలుగును

సావిత్రి యరిగినదెసకై చూచుచు మిత్రునితో నిష్క్రమించును.)

ఇది ప్రథమాంకము

ఈమూడును గల్గియున్నవానికి సౌందర్యము గొంతతగ్గియుండును. అబ్బా! ఇవి యన్నియును గలిగినవరునిఁ దెచ్చుటమిక్కిలి కష్టతరముగదా?

తే. గీ. పరిణయము సేయఁ బ్రాయంబు ♦ వచ్చెఁ గాదె
విమలగుణశీల మనదుసా ♦ విత్రికిపుడు
యింక జేయకయున్న న ♦ రేంద్రులెల్ల
బరిహసింపరె మనల భా ♦ వంబులందు.

ఆ సత్యవంతునిఁ దప్ప నితరుల వరింపనని పట్టుబట్టినది. ఇందులకు నేనేమి సేయుదును? ఆద్యుమత్సేనుఁడు రాజ్యభ్రష్టుండై యంధుడై సతీసుతులతో నరణ్యవాసియైయున్నవాఁడు. కన్నులార నిట్టిది చూచుచు నాతని పుత్రునకు మన మెట్లు సావిత్రినిచ్చి వివాహము సేయగలము?

మాళవి—నాథా! చిన్నదియాగుట చేనట్లు చెప్పియుండును. మనము బుజ్జగించి నెమ్మదిగాఁ జెప్పినచో నదియేల వినకయుండును?

అశ్వ—అమ్మాయిని బిలిపించి నీయెదుట జెప్పెదను నీవుగూడ జెప్పుము. నాకుమాత్ర మట్టిసంబంధ మీయవలయునని యిష్టమున్నదా యేమి? (ప్రక్కఁజూచి) ఎవరక్కడ?

(తెరలో—మహారాజా! ఏమి సెలవు?)

అశ్వ—సావిత్రి నిటు దోడ్కొనిరమ్ము.

సావిత్రి - ప్రవేశించును.

సావి—(తండ్రిం జూచి) తండ్రీ నమస్కారములు.

అశ్వ—అమ్మాయీ! ఇటువచ్చి కూర్చుండుము.

సావి—(తండ్రి ప్రక్క నాసీనయగును.)

అశ్వ—కుమారీ! సావిత్రీ! సంతానము లేక లేక తపంబొనర్చి సావిత్రీ ప్రసాదమున నిన్ను మేము గంటిమి. మాకు పుత్రులు [illegible]

బుత్రికవయినను నీవే. నీకతంబున మేము కృతార్థులము కావల్
యును. మా యాసలన్నియు నీపై నిలిపియుంటిమి. నీకును వివా
హమునకు దగిన వయస్సువచ్చినది. ఇంక నేను నీవివాహవిషయ
మున నాలసించితినేని రాజలోకమునఁ బరిహాసపాత్రుఁడనగుట
నిశ్చయము. కావున నీ కనురూపుఁడగువరుని గోరుకొనుము. ఏకా
ర్యమునైనఁ జేయుటపట్లనొకరిచే వేళ్లు మడిపించుకొనునట్లుండఁగూ
డదుగదా. సత్యవంతునిఁ దప్ప నన్యులను వరింపనను నీపట్టుదల
మానుము. తల్లీ! ఏవిశేషమును జూచి యా సత్యవంతుని వరించి
తివో దెలియకున్నది.

తే॥ గీ॥ అతనిరాష్ట్రంబులెల్ల దా ♦ యలకు నిచ్చి
తల్లిదండ్రులతోడను ♦ దపసివోలె
కాననంబులలో గడుఁ ♦ గష్టపడెడి
సత్యవంతునిఁ గోరుదే ♦ చాలుఁ జాలు॥

నీవు సత్యవంతునిఁ గోరితివని యెవ్వరైన విన్నచో నవ్వుదురు. అది యుం
గాక, సకలంబు నెఱింగి యుండియుఁ జక్కని చుక్కయగు నాతురను రాజ్య
చ్యుతుఁడై, నిరుపేదయై, యరణ్యవాసియైయున్న సత్యవంతునఁ గోరంగి
గొంతుకకోసెనను నింద నాకబ్బును. నీవజ్ఞానురాలవు గావు. చదువు
కొన్నదానవు. సమస్తమును దెలియుదు.

మ॥ కల రింకెందరో భూపతుల్ భువినిలో ♦ కఖ్యాతిమైమించువా
రలు, సౌందర్యమునందు మన్మథునిఁ దా ♦ రాధీశునిఁ మించువా
రలు, తేజంబున భాను మించదగుఁ వా ♦ రల్ గాన నీ వట్టివా
రిలో వేడ్కన్ దగువాని గోరుకొనుమ ♦ ర్థిన్ చంద్రబింబాననా॥

మాళ—పుత్రీ! తల్లిదండ్రులమగు మామాట నాలింపుము. మేమెప్పు
డును నీశ్రేయమును కోరువారముగాని యన్యథా తలంచువార
ముగాము. నీవు తగినవరునిఁ జేపట్టి సౌఖ్యమందినను జూచి
యానందించువారముగదా!

సావి—తల్లిదండ్రులారా! ఇంతవరకును నను బెంచి పెద్దదానిగ జేసిన మీరు నాశ్రేయముగోరుదురని నాకు దెలియును. మాతృపితృ ఋణము నే నెప్పటికిని దీర్పజాలను. కాని మీరు నాయుద్దేశము సంపూర్తిగ గ్రహింపక యుంటిరిగదాయని నేను విచారింపుచున్నాను. అనేక రాజకుమారుల చిత్రపటంబుల జూచినను నిం చుకేనియుం జలింపని నాహృదయము నాసత్యవంతుని పై జిక్కినది ఆతడే నావరుడని నిశ్చయించుకొని యుంటిని. నేను మనసార వరించిన యాతని విడిచి వేఱొకని గోరుట ధర్మముగాదు అట్టిది సాధ్వికి లక్షణముగాదు. ఇట్లు సేయుమని చెప్పుటగూడ మిగుల దోషమని నొక్కి వక్కాణింపుచున్నాను.

అశ్వ—పుత్రీ!

తే. గీ. సంపదలయందు మఱియు రా ♦ జ్యంబునందు
నమిత ధనమందు ఘనవరా ♦ క్రమమునందు
మిగుల దీపించు రాజుల ♦ జగతియందు
లేరె! పరిణయంబాడంగ ♦ లేమ! వినుమ.

సావి—తండ్రీ! రాజులులేకేమి! ధరాతలమంతయు ననేక రాజన్యను యమైయున్నది. సంపదలంజూచిగాని సౌందర్యాది గుణములం జూచిగాని నేను సత్యవంతుని వరించలేదు. ఒకప్పుడు మహదైశ్వర్యవంతుడు నిర్భాగ్యుండగుచు నిర్భాగ్యుడు మహదైశ్వర్యవంతుడగును. కాలచక్రమెట్లు తిరిగిన మానవులట్లు దిరుగుచుందురు.

తే. గీ. అతడె నాపాలి దైవంబు ♦ నతడె భర్త
యతడె నాయేలుగడయును ♦ ననుచు దలచి
భావమున గోరితిని సత్య ♦ వంతు నేను
సంశయింపక చెప్పితి ♦ క్షాంత లేందు!

తమ పుత్రిక చిత్త మెవ్వనిపై జిక్కెనో యట్టివానికిచ్చి పెండ్లి

చేయుట తల్లిదండ్రులకు శ్రేయస్కరము. సత్యవంతుడు రాజ్యభ్రష్టుడనియు వనవాసియనియుఁ జెప్పితిరి. అశాశ్వతమగు రాజ్యలక్ష్మినిగాని, చంచలమగు సౌఖ్యములగాని నేను వాంఛించియుండలేను. నాకుగావలసినది ఒక్కగుణమే. అట్టిది సత్యవంతునియొద్ద నుండినట్లు నేను గ్రహించితిని నే నాతని వరించితిని. ఇంక మీరు నన్నాతనికొసంగి వివాహముగావించి కృతార్థులగుడు.

మాళ—అమ్మాయీ! నీవు పట్టినపట్టు విడువవా?

సావి—ఇందు పట్టేమియును లేదు. మనసార గోరిన యాతనిన్విడిచి యన్యులఁగోరుటకు నాచిత్తము సమ్మతింపదు. ఇక మీరట్టియాలోచన విడువుడు.

మాళ—నీయుద్దేశమును విడువవా?

సావి—ఏది పదిసారులడిగెదవు! నా నిశ్చయము నింతకుబూర్వమే మీకుఁ జెప్పియుంటినిగదా.

మాళ—[అశ్వపతిం జూచి] నాథా! ఇఁక, నావిషయమునుగూర్చి దీనిన డిగి నందువలన బ్రయోజనములేదు. మీరు మనకిదోచినయొక్క రాజకుమారునకు దీని నిచ్చుప్రయత్నము సేయుడు. ఇదిచెప్పినట్లు మనము చేయుటపాడిగాదు. దీనిసమ్మతితో మనకేమిపని యున్నది. ఇంతగారాబముగాఁ బెంచినకారణముచేతనే యిప్పుడిచ్చవచ్చినట్లు మననెత్తికెక్కినది.

సావి—అమ్మా! నీమాటలు మిగుల వింతగొలుపుచున్నవి.

మ॥ వరభూపాదు లొసంగుటో ప్రియమొల ♦ ర్పక జీరలఁ దెచ్చిభా
స్వరతఁ గట్టగఁ బెట్టి ముచ్చటలు దీ ♦ ర్పంగాఁ దలంపూనుటో
తరుణీరత్నము గోరుకొన్నవరు మో ♦ దంబారగాఁ దెచ్చి సాం
పరయఁ బెండిలిసేయకుండుటది భా ♦ వంబాదు యోచింపుమా.

నేను వరించినవానిని విడిచి [illegible] వేరొకనిం దెచ్చికట్టిపెట్టి నా గొంతుకఁ గోయదలంచితివా యేమి?

మాళ—నీకొంతుక మేము గోయదలంపలేదు. ఎవ్వఁడోయొక నిరుపేదను వరించి నీగొంతుక నీవే గోసికొనఁ దలంచుచున్నావు.

సావి—తల్లీ! భాగ్యాభాగ్యములు భగవత్ప్రసాదితములు. ఒకవేళ సత్యవంతుండు నిరుపేదగా నుండినను వివాహమైనపిదప, బరమేశ్వరుని కరుణవలన భాగ్యాన్వితుఁడై యొప్పఁగూడదా:

మాళ—ఇప్పటి కాతనిభాగ్య మింతచక్కఁగా నున్నదికదా! ఇంకనిన్ను వివాహమాడినపిదప సంపదతో దులదూఁగును గాఁబోలు! ఎందుకీమాటలు; నీవు పట్టినపట్టు మాత్రము విడువక యున్నావు. ఒకవేళ సత్యవంతుఁడు నిన్ను వివాహమాడనని చెప్పినచో నీవేమి చేయుదువు: అప్పడు వేఱొకనిని వరింతువా యేమి?

సావి—అట్లెన్నటికిని జరుగదు. ఒకవేళ నన్ను సత్యవంతుఁడు వివాహమాడుటకు సమ్మతింపనిచో నేమిచేయుదునని యడుగుచుంటివా నామనోనిశ్చయమును వినుము.

చ॥ గరళము లేదె గ్రోలగను ♦ ఖడ్గము జిక్కదె గొంతుకోతకై
వరనదులెల్లయింకినవె ♦ భవ్యతటాకములెండిపోయెనే
యురికిని త్రాడుగల్గదొకొ ♦ యుర్విని సాళ్వసుతుండు తాను నన్
బరిణయమాడకుండిన మ ♦ నంబున నిశ్చయముగ్ వచించితిన్.

మాళ—కానిమ్ము. కష్టసుఖము లనుభవించుదానవు నీవు. నీవ్రాత యెట్లు నట్లగును. దానినెవ్వడు దప్పింపగలడు.

అశ్వ—(భార్యంజూచి) సతీ! పిల్లతో వాగ్వాదమేటికి?

దాసి—(ప్రవేశించి) దేవా? నారదమునీంద్రుడు వచ్చుచున్నాడు.

[నారదుఁడు పాటఁబాడుచు ప్రవేశించును.]

అశ్వ—(భార్యతో నెదురేగి నమస్కరించి, మునీంద్రా! ఇటుదయచేసి యీభద్రపీఠ మలంకరింపుడు.

[నారదుఁడాసీనుఁడగుచున్నాఁడు.]

అశ్వ—సావిత్రినిఁజూచి(అమ్మాయీ ! ఈ నారదమునీంద్రునకు నమస్కరింపుము.

సావి—(అట్లుచేయుచున్నది.)

నార—అశ్వపతింజూచి)

తే॥ గీ॥ మునిజనార్చనంబు మరియుఁ ♦ బుడమిసురల
సేవ సేయుచుందువె నీవు ♦ క్షితితలేంద్ర !
యాలుబిడ్డలు కుశలులై ♦ యలరుచుండె
శత్రుబాధలేక పుడమి ♦ శాంతిగనెనె?

అశ్వ—తావకకృపచే మే మందరమును సుఖులమై యుంటిమి. మహాత్మా! తావకాగమనము మాకు శుభప్రదమని తలంచుచున్నాము. పుత్రికావివాహము విషయమున నాలోచించుచుండగా నీవరుదెంచితివి. ఇవ్విషయమున దగుమార్గ మొకటి మాకుఁజూపి రక్షించెదవుగాక !

నార—ఏమీ ! నీ పుత్రికారత్నమగు సావిత్రికింకను వివాహ మొనర్చియుండలేదా.

అశ్వ—లేదు. ఆవిషయమున నే ప్రయత్నము సేయుచుంటిని!

నార—ఇంత యాలస్య మేలచేసితివి? తగినవరుఁడు లభింపకయుండుటచేతనా?

అశ్వ—దేవా ! ఏమని చెప్పుదును. అనేకరాజ్యముల చిత్రపటములు దెప్పించి సావిత్రికిజూపితిని. అందెవ్వరిని నామె వరింపక సాళ్వరాజ సుతుఁడగు సత్యవంతునేకోరియుండెను. మునీంద్రా!ఇందులకు నాకేమిదారి ?

నార—(సావిత్రినిఁజూచి) అమ్మా ! సావిత్రీ! రాజ్యభ్రష్టుఁడై కానవం

బుల వసింపుచున్న యాతని నేల వరించెదవు? మఱొక్కనిని గోరుకొనరాదా?

సావి—మునీంద్రా! సమస్త ధర్మాధర్మములను దెలిసియుండిన నీవే యిట్లు వక్కాణించిన నేమనఁగలదానను చిత్తమందు మొదట వరించినవానిని విడిచి వేరొక్కనిని మరలఁగోరుట ధర్మశాస్త్రవిరుద్ధముగాదా! అదియుంగాక యది యుత్తమస్త్రీ లక్షణము గునా? తాపసోత్తమా! పక్షపాతరహితుఁడవై యీవిషయమున నీవు సత్యము జెప్పుము

నార—(తనలో) ఆహా! ఏమి! ఈచానశీలము! మనోధైర్యము! (ప్రకాశముగా) నే నందుకు వచింపలేను. అట్టివాఁ గైకొని నీ వేమి సుఖించెదవు.

తే॥ గీ॥ కందమూలఫలముల మె ♦ క్కంగవలయు
నారచీరలనే మెయిఁ ♦ దాల్పవలయు
దర్భశయ్యలయందునే ♦ దనరవలయు
గామినీ! యేమిసౌఖ్యంబు ♦ గందువీవు

నీ వాగర్భశ్రీమంతురాలవు సుందరారామసీమలందుండి మహాసౌఖ్యముల నందుచుండెడిదానవు. అట్టి నీవు సత్యవంతుని వివాహమాడుటేమి: వేరొకని వరింపుము.

సావి—తాపసోత్తమా నీవు కూడ మాతల్లిదండ్రుల మార్గముననే త్రొక్కుచున్నందుకు వింతయగుచున్నది నాచిత్తమును నీవు పరీక్షింప నవసరములేదు. సత్యవంతునిదప్ప వేరొకరిని వరింపను.

నార—(తనలో) ఇంక నీమె యన్యుల వరించుటకు సమ్మతింపదు. (ప్రకాశముగా) రాజేంద్రా! ఇంక నీకుమారి నీమాటలు విననదికాదు. ఈమె చిత్తము తిరుగదు. కానిమ్ము. ఈమె పుణ్యవశమున సత్యవంతుఁడు మరల భాగ్యవంతుఁడగునేమో? కాని వివాహవిషయమగాన నొక్కసంగతి మాత్రము జెప్పవలసి యున్నది. ఇట్టి

విషయమునం దెఱిగియుండియుఁ జెప్పకుండుట భావ్యముగాదు. ఆ సత్యవంతునకు వివాహమైన యొకసంవత్సరమునకే మరణము సంభవించును.

అశ్వ—
మాళ— } హారి! హారీ!

అశ్వ—(సావిత్రిఁజూచి) అమ్మా! వింటివిగదా, ఇంకనాకోరికను విడువుము.

మాళ—ఈమాట విన్నతరువాత విడువకయేమిచేయును! పరిణయమాడిన సంవత్సరమునకే మృతిఁజెందునని తెలిసియుండఁగా నాతనినే వరించుటకేమెచిత్తము సమ్మతించునా యేమి!

సావి— అమ్మా! నీవు నామనోనిశ్చయము నింకను గనిపెట్టలేదుగదా. సత్యవంతుని కాఁతి మరణము సంభవించునని మీ సంయమీంద్రుఁడు పలికినంతనే నాడెందం బందుకు భయంబంది యధర్మ ప్రవర్తనకు గడుతునా! మనసారఁ గోరినయాతనిని విడిచి వేరొకని వరింతునా! నారదుఁడు చెప్పినమాట నిజమేయై యుండుఁగాక! అయిననేమి! అంబికా కటాక్షమున నాతఁడు దీర్ఘాయుష్మంతుఁడై మనఁగూడదా అట్లొకవేళ సంభవింపనిచో నేనుగూడ నాతనిమార్గమునే యనుసరించెదఁగాక! ముమ్మాటికిని సత్యవంతుఁడే నాప్రాణనాథుఁడు అతనిందప్ప నేనన్యులవరింపను

మాళ—ఏమే నీకస్వాతంత్ర్యము ఇంచుకయైనను భయములేక తల్లిదండ్రులమాటల కెదురుబల్కుచుంటివి

అశ్వ—తల్లీ! సావిత్రీ! సమస్తమును నెఱింగియుండియు నీకింతుకనెట్లు గోయుదుము! నీ వీకోరికను విడిచి మరియొకని వరించి కులముద్ధరింపుము

సావి—మిన్నువచ్చి తలపై బడినను నే నధర్మకార్య మొనరింపను

అశ్వ—(నారదునిఁ జూచి) బ్రహ్మమానసపుత్రా! నారదా! వింటిగదా సావిత్రి మనోనిశ్చయము. మాకేమి దారి జూపించెదవు వివాహమైన సంవత్సరమునకే మృతిజెందు సత్యవంతునకీమె నీయవలసిన దేనా!

నార—(తనలో) ఆహా! ఈమె మనోనిశ్చయ మద్వితీయమైయున్నది. సుగుణములన్నియు సావిత్రియందు ముదగాజేరి యుండినట్లు దోచుచున్నది కాకున్నచో నింత ధైర్యము నిట్టిసాహసము, నిట్టి శీలము మఱి యేకాంతామణులయందైన జూచియుంటినా సుగుణవతియు, నుత్తమురాలునను పదము లీమెకే తగియున్నవి బాగుగా నాలోచించిచూడగా నీమెవలన నుభయకులములు గూడ బవిత్రమగునని తోచుచున్నది. ఈమెకు బరిణయమైన వత్సరమునకు భర్తకు మృతిసంభవించినను భగవత్కటాక్షమున దీర్ఘసుమంగలిగా దనరగలదని నాచిత్తమునకు బొడగట్టుచున్నది. పరమేశ్వరుఁడిట్టివారలను గాకమఱియెట్టివారలనురక్షించును? (ప్రకాశముగా) భూపాలా! అశ్వపతి! ఇంక నీసావిత్రి తన మనోనిశ్చయమును విడువదు కాని పరమేశ్వరుని దయచే నీమె దీర్ఘసుమంగలిగావచ్చును. ఇక నీవన్యథా యోచింపక యీమె కోరినట్లు సత్యవంతునికే యొసంగి వివాహముగావింపుము. బలపరాక్రమములందుగాని, సౌందర్యముగాని, సత్యసంధతయందుగాని, వినయవివేకాదిసద్గుణములయందుగాని ద్యుమత్సేనపుత్రుండగు నాతనితోఁ దుల్యుడు ధరాతలమందు లేడు. ఇంక నీవు సంశయింపకుము. నేను పోయివచ్చెదను.

సావి—మునీంద్రా! నేను ధన్యనైతిని. (నమస్కరించును.)

అశ్వ—సావిత్రిఁ జూచి) తల్లీ! విచారముడుగుము. నీవు కోరినట్లు సత్యవంతునకే యొసంగెదను. (నారదునిఁ జూచి) మహాత్మా! నమస్కరించుచున్నాము. కృపయుంచుఁడు.

(మాళవి, అశ్వ, నమస్కరింతురు.)

నార—సకల శుభావాప్తిరస్తు ! (నిష్క్రమించును)

అశ్వ—అమ్మా సావిత్రీ! ఇంకరమ్మా (మాళవినిజూచి) సతీమణీ శుభదినముచూచుకొని, పిల్లను వెంటబెట్టుకొని వింధ్యారణ్యముననున్న ద్యుమత్సేనమహీభుజునికడ కరిగి యీసంగతి దెలియజేసి యాతడెట్లు చెప్పునో యట్లుచేయుదము. రమ్ము. తత్ప్రయత్నమున నుండవలయును. (అందరును నిష్క్రమింతురు.

రంగము—[వింధ్యారణ్యమున ద్యుమత్సేనాశ్రమ సమీపవనము—

[ప్రవేశము——సత్యవంతుడు.]

సత్య—(తనలో) అకటా ఎన్నాళ్ళని యీదుర్దశంబొంది, యీఘోరారణ్యమున వసించుట ! రాజ్యభ్రష్టతకు జింతింపనుగాని యంధులై యనేకకష్టముల నందుచున్న మాతలిదండ్రులజూచిన నాకెంతయుదుఃఖమువచ్చుచున్నది- ప్రపంచమున మించిన దుర్దశలన్నిటియందును నంధతనుమించిన దేదియునులేదుగదా ! ఒరుల సహాయమపేక్షింపకుండ నంధులేకార్యమును జేయజాలరు. ఇంక నెంతకాలము మాకీ వనవాసాయాసము ధాతవ్రాసినాడో కదా

చ॥ అడవులవాసమెప్పటికి ♦ నైనను దీఱునె మాకు శత్రువుల్
బుడమినిఁ గూల్పఁగాఁ గలిగినె ♦ భూరితరంబగు రాజ్యలక్ష్మిచే
పడునొకొ తండ్రికిన్ మఱల ♦ బహువుతెర్లను హర్షమంద నే
నడువునకష్టసంచయము ♦ వాయును మమ్ముల, దోఁచదయ్యెడన్.

(వనముద్దేశించి) ఓరీ ! చిత్రకేతూ. ఎంత ఘోరకార్యమాచరించితివిరా ?

తే॥ గీ॥ ధర్మసంఘుండు సుగుణుండు ♦ దానపరుఁడు
సత్యమే జయమనుమాట ♦ జరుపువాఁడు

నైన నాతండ్రిని రణమునందు గెలచి
వడల నడిపితే! రాజ్యంబు ♦ విడచిపోవ.

ఓరీ! పాపకర్మా! వృద్ధుడైన నరపాలునిమీదనా నీశౌర్యముజూపించుట! ఆసమయమున నేను బాలుడనై యుంటచే బ్రతికిపోయితివి, కానిమ్ము. ఎన్నటికైనను నిన్ను రణమున గూల్చి నా రాజ్యము స్వాధీనపఱచుకొనలేక పోవుదునా? నీవొనర్చినమహాదారుణకృత్యములు నాచిత్తంబున మెలంగుచునే యున్నవి. నీపై నెత్తివచ్చుట కింత వరకునునాతండ్రిగారాజ్ఞనీయక పోవుటచే బ్రతికిపోయితివి. అరణ్యముననందులై యున్నతల్లిదండ్రుల సేవింపుచున్న యీసత్యవంతుఁ డేమి చేయఁగలుగునని గర్వించియుంటివిగాబోలు దురాత్మా! దైవబలమున్నవారికి నేనలుగాన మఱియేవిగాని యవసరములేదు. ఓరీ! చిత్రకేతూ!

సీ. భీమాహవంబున ♦ విరులెల్లరు మెచ్చ
ఘనరిపుశీర్షముల్ ♦ దునుము వఱకు
దునుమాడి యందు నీ ♦ దు శిరంబు గోటముం
దరఁగట్టి ముదమునఁ ♦ దనరువఱకు
రాష్ట్రజనులనెల్ల ♦ రావించి యాశిరం
బందరకును జూపి ♦ యలరు వఱకు
ధర్మాత్ముఁడైన నా ♦ తండ్రినిఁ గమ్మర
సింహాసనాసీనుఁ ♦ జేయువఱకు

తే. గీ. సదునామంబు మరువను ♦ నిద్రబోను
సంతతము పట్టి యత్నంబు ♦ సలుపుచుందు
సంచితంబైన ప్రీతినఁ జె ♦ ల్లించుకొందు
బ్రతికియుండిన నేనింక ♦ బాపచరిత!

కానిమ్ము, కొలది దినము లోపికవహింపుము. నీగర్వవృక్షమునసమూలముగాఁ బెల్లగించెదగాక. (ఇంచుక యూరకుండి) అయ్యో! నేనీవిషయమై యాలోచింపుచునేయుంటిని. నాచిత్తమా సావిత్రిపై గిరుగుచున

యున్నది. ఆమెసంగతి మఱచిపోవుదమని యెంతనిశ్చయించినను మఱవ నకు రాకున్నది. రేయింబవళ్లు సావిత్రి నాకన్నులయెదుట నున్నటులే నా యున్నది. ఆహా! ఏమి! ఆబాలామణి సౌందర్యము!

సీ. చైతన్యమందిన ♦ చక్కని చిత్రంబు
చిఱునవ్వుగాంచిన ♦ చిగురుబొమ్మ
నడుపాడఁగానేర్చి ♦ న లలిత తనువల్లి
మురిపెంబు దాల్చిన ♦ విరులబంతి
వక్రితఁబాపంగ ♦ వచ్చిన క్రొన్నెల
పలుకాడఁ గరచిన ♦ పసిడి ప్రతిమ
నిలుకడ గలిగిన ♦ తొలికారు మెఱుఁగు ధ
రకు డిగ్గినట్టి ద ♦ ర్పకుని యలుగు
తే. గీ. ననఁగ జెలువొందు నాయెల ♦ నాగ మహిమ
మంజులాకార మెపుడు నా ♦ మానసమున
బాయకున్నది మరల న ♦ ప్పద్మగంధిఁ
జూచు టేనాఁడొక్కొ గలుగునో ♦ తోఁచదయ్యె

అబ్బా! ఆమెను దలచినంతనే మన్మథుండు పొంచిపొంచి నాపై శరములఁబరపుచున్నాఁడు. (మన్మథుని నుద్దేశించి) ఓయీ కామ దేవా! నీవు భగవంతుఁడవగు శ్రీమన్నారాయణుని గర్భమున జనించితివి. సమస్తసౌఖ్యములకును దూరమై యంధులైన తల్లి దండ్రుల సేవించుచు నరణ్యమునఁ బరమవిరాగినై యున్న నాపై నేల శరప్రయోగము గావించెదవు? నీవిట్టి దుష్కార్యములు సేయు చుండుట చేతనే నిన్ను మున్నొకసారి శంకరుఁడుఁ దన కోపాగ్ని జ్వాలల భస్మము గావించినాఁడు కాని నీభార్యయగు రతీదేవి మం గళసూత్రమహిమచే బ్రతికిపోయితివి. అయినను నీకు శౌర్యము చావలేదు. ఇంత వచ్చినను నీసు చావలేదు. మాటయిట్టిదే.

[గాలవుఁడు—ప్రవేశించును

గాల—(ప్రవేశించి తనలో) ఈతఁడు వ్యాఘ్రము బారినుండి తప్పించిన కన్యామణిని జూచిన నాటనుండియు నెప్పుడు చూచినను నేదియో దీర్ఘాలోచన సేయుచునే యుండును ఇప్పుడీతని వైఖరిచూడగా మన్మథావస్థను మునింగినట్లు దోచుచున్నది (సమీపించి) మిత్రమా! సత్యవంతా! ఆ స్త్రీపిశాచము నిన్నుఁబట్టి పీడించుచున్నదే ఆమెపై మోహము నీకొండంత వెలియనీయకున్నది. అరణ్యమునఁ దాపసివలె నున్న నీకీ స్త్రీ వ్యసనమేల? నీకుగల్గిన యీ స్త్రీ చింత దల్లిదండ్రుల సేవలనుగూడ మరపించుచున్నది

సత్య—మిత్రమా! గాలవా? వచ్చితివా! అయ్యో! నాయవస్థనేమని చెప్పుదును

తే॥ గీ॥ భయద సంగ్రామ భూమిని ♦ వైరివిడుచు
శస్త్రచయమున కింతయు ♦ జంకగాని
కామదేవుఁడు నాపైనఁ ♦ గరుణలేక
శస్త్రములు బరపుటజూచి ♦ జంకుచుంటి

గాల—ఇదియేనా నీ మనోధైర్యము! గురులనుభజించి సకల శాస్త్రార్థముల గ్రహించి నందువలనఁ బ్రయోజనమేమియున్నది! ముక్కుమూసికొని యరణ్యమునందు దపము జేసినందువలన బ్రయోజనమేమియున్నది. సర్వతీర్థ సంచరణమువలన బ్రయోజనమేమియున్నది! ఆ మన్మథుని జయించినప్పుడే మానవుఁడు ధన్యుఁడగును! ఏదో మార్గవశమునఁదటస్థించిన యొక కన్యకం జూచి ఇట్లు పరితపించుట నీ బోటిధీరులకు లక్షణముకాదు.

సత్య—సఖుడా! ఆమె సామాన్యకాంత కాదు

తే. గీ. ఆమె చక్కదనంబును ♦ నామె చూపు
నామెగుణములు వినయంబు ♦ నామె మృదుల

భాషణంబులు నాదు భా ♦ వంబునందు
నాటియున్నవి నిజమునా ♦ నమ్మనయ్య

(తెరలో ధ్వని)

సత్య—సఖుడా, ఏదియొం కలకలము వినవచ్చుచున్నదే

గాల—(చూచి) కలకలము కాదు హయములు నేనుగులు రథములు గూడ గాన్పించుచునే యున్నవి ఇదియేదో వింతగాం దోచుచున్నది అటుచూడుము. ఎవ్వండో యొకండు మార్గమునసే పాదచారియై వచ్చుచున్నాండు ఆతడొక నరేంద్రునివలె గనట్టుచున్నాండు.

సత్య—మిత్రమా! ఈతడెవ్వడో మనకు వైరియై యుండును మనలను రాజ్యంబునుండి వెడలనడిపిన చిత్రకేతుండే యైయుండును. అరణ్యములందుంగూడ మనలనుండనీయక ప్రాణములందీయవచ్చుచున్నాడు.

(తెరలో)

అయ్యా! ద్యుమత్సేనాశ్రమమునకు మార్గమిదియేనా

సత్య—[గాలవునిచూచి ఇంక నూరకొనరాదు (ప్రకాశముగా) ఓరీ దురాత్మా! చిత్రకేతూ! నీకు ద్యుమత్సేనాశ్రమమునకుమార్గము గావలయునా! రమ్మ నేను బాలుండనై యుండగా మాతండ్రిని రణంబునంగెలిచి రాజ్యంబునుండి వెడలనడపి యదిచాలక వనంబులనుండు మా ప్రాణములం గైకొనదలంచి వచ్చితివా! రమ్మ. మాకష్టములదీర నిన్నిప్పుడె కాలుని ప్రోలికంపుదును

శరమును నెక్కుబెట్టి

మ॥ సమదాటోప భుజప్రతాపమహిమన్ ♦ శౌర్యంబు దీపింప వ
త్సమునన్ బాణపరంపరాహతిని నీ ♦ కన్ గూర్చి యస్మత్స్వథ

ర్మము నిర్మించెద నెల్లలోకములు స ♦ న్మానంబుగావింపఁ గ
ష్టము లెల్లఁ మముఁ వీడిపోవఁగను నీ ♦ చా! రాజవంశాధమా!

అశ్వ—(ప్రవేశించి) ఈతనివాక్యముల సరణిఁజూడఁగా నీతఁడే సత్యవంతుఁడని తోఁచుచున్నది. (ప్రకాశముగా) రాజకుమారా! తొందరపడకుము. నేను నీకు వైరినిఁగాను. మద్రదేశంబు పాలించు అశ్వపతిని. నీతండ్రియగు ద్యుమత్సేను దర్శింప నరుదెంచితిని. మీ [illegible].

సత్య—అయ్యా! నాతొందరకు క్షమింపుము. దుష్టుండగు చిత్రకేతుండు మాపై కెత్తివచ్చుచుండు నేమోయని యట్లొనర్చితిని. (ఇంచుక యూరకుండి స్వగతము) ఈతఁడిచ్చ్యెడ కిప్పుడరుదెంచుట కేమి కారణమో కదా.

తే. గీ. ఏనువలసిన సావిత్రి ♦ కితఁడు తండ్రి
గాఁడె; యితనురాకకు నేమి ♦ కారణంబొ?
యదరుచుండెను గుడికన్ను ♦ నొదవుశుభ మ
దేదొ చిత్తమున కింతయు ♦ నెఱుఁగరాదు.

(ఎదుటఁజూచి) అదుగో! ఈతఁడు కుటుంబముతోఁ గూడ వచ్చియున్నాఁడు. (ఆశ్చర్యము నటించి) ఆహా! ఏమి నా పూర్వపుణ్యము!

తే. గీ. అదుగో! వలచిన సావిత్రి ♦ యరుగుదెంచె
గన్నులుండిన ఫలమును ♦ గాంచినాఁడ;
గరితమిన్నను నేఁ జూడఁ ♦ గలనొ లేనొ
యనెడు సంశయంబంతయు ♦ నంతరించె.

గాల—(అశ్వపతినిఁ జూచి) అయ్యా! నీవు మద్రదేశమేలు భూపతివా? ద్యుమత్సేనునితో నేమిపనికై యుండి వచ్చితివో నెఱుంగవచ్చునా?

అశ్వ—అస్మత్పుత్రికా వివాహార్థమై యరుదెంచితిని.

గాల—సత్యవంతునితో (రహస్యముగా) మిత్రమా! నీరొట్టె నేతిలోఁ బడినది.

సత్య—గాలవా? వీరికి మన యాశ్రమమును జూపుచురమ్ము. (అశ్వపతినిఁజూచి, నృపాలపుంగవా! ఇటురమ్ము.

(నిష్క్రమించుచున్నారు)

రంగము;—ఆశ్రమమున ద్యుమత్సేనుఁడు, భద్రాంగి]

ద్యుమ—(భద్రాంగి జూచి) సతీమణీ! మన కష్టములెప్పటికి సమాప్తి యగునో కదా? భగవంతునియెడల మన మేయపరాధము గావించినామని మనల నిట్టి దుర్గతిపాలు గావించెనో యెఱుఁగరాదయ్యెను. ఇది యంతయు మన పూర్వకృత కర్మఫలము కాబోలు కాకున్నచో మనకీ యవస్థ యేల సంభవించును?

సీ. కంటకావృతమైన ♦ కానన శ్రేణులే
ఘనమైన యుద్యాన ♦ వనములయ్యె
భవ్యతాపసులుండు ♦ పర్ణశాలలె యిష్ట
రమణీయమౌ మంది ♦ రంబులయ్యె
ఘోర భయంకర ♦ క్రూరమృగంబులే
మనయాజ్ఞ నెఱవేర్చు ♦ మంత్రులైరి
కఠిన పాషాణ ప్ర ♦ కరములె మోదంబు
సమకూర్చు పూవుల ♦ శయ్యలయ్యె

తే.గీ. హా! యింకేమందు మనగతి ♦ కతివమిన్న
కష్టముల నెన్నటికినైనఁ ♦ గడవగలమె
వననివాసము వీడి పూ ♦ ర్వపు సుఖంబు
లందఁగాఁగలమె తోచ ♦ దెద్యనకట.

అయ్యో! అంధులమై యిట్లు దేహయాత్రఁ గడుపవలసివచ్చినది కదా! ఒరుల సహాయము లేకుండ నొక్కయడుగైనను వలఁ బోఁజాలము. ఎదుట కెవ్వరువచ్చినది యెవ్వరైనఁ జెప్పకున్నచో దెలి

యదు. ఈవార్ధకమునకుఁ దోడు గుడ్డితనము కుండమనల నాన
హించినది. రాజ్యభ్రష్టతకుగాని, ముసలితనమునకుగాని, యం
ధతకుగాని వగవను. కాని, బాల్యంబున ననేక పరిచారకులచే
బరిచర్యలందుచు నెండకన్నను వానకన్నను నెన్నడును నెఱుం
గని మనసత్యవంతుడు మనకై యెన్నియో శ్రమలందుచున్నాఁ
డుగదా !! అతడు పడుచున్న కష్టములు చూచిన నాకడుపు
తరుగుకొనిపోవుచున్నది. నాకువార్ధకము వచ్చెను. ఇంక చిరం
జీవి రాజ్యపదమున నిలిపి సౌఖ్యంబు లందదలంచితినిగాని,
యీరీతిని భగవంతుడు మనల వెతల బాలుచేసినాడు. ఇట్టి
దుర్గతి యెన్నాళ్ళనుభవింపవలయునో.

భద్రా—నాథా ! మన మీరీతిని జీవించినందువలన బ్రయోజన
మేమి యున్నది. మనమే చింతింపవలయును, మనమే యోదా
ర్చుకొనవలయును. సత్యవంతుని భగవంతుడు మనకు బ్రసా
దించియుండుటచేత మనకీ కష్టము లు కష్టములుగా గనుపించుట
లేదు. కుమారుని పితృమాతృభక్తి శ్రీరాముని మించియున్నది
మనకే సమయమున నేది కావలసియుండునో సమస్తమును నె
ఱింగి మాతో [illegible] రూపమునుడై మనకు సపర్యల జేయుచున్నా
డు. కానిందు ఎప్పటి మన కష్టములు గట్టెక్కక పోవునా !

ద్యుమ—అట్టి భాగ్య మీమా భృత్యుల కిన్నబాయు సంశయింపుచు
న్నాను. (యించుకము రకుండి) ఎవరో మనుష్యుల యలికిడి విన
వచ్చుచున్నది.

భద్రా—సత్యవంతుడు వచ్చుచున్నాడేమో

[సత్యవంతుడు, అశ్వపతి, మాళవి, సావిత్రి, గాలవుడు ప్రవే
శించుచున్నారు

సత్య—(తండ్రిజూచి) తండ్రీ! నన్నుజూచుటకు మద్రదేశాధీశ్వరుం
డగు డశ్వపతి తన భార్యయగు మాళవితోడను సుతయగు సావి
త్రితోడను వచ్చియున్నాడు.

ద్యుమ — నాయనా ! ఏమి మనభాగ్యము! ఇప్పుడు వారెందున్నవారు

సత్య—ఇదిగో వారు నీయెదుటనే యున్నారు.

ద్యుమ—అయ్యో! ఎంతనిర్భాగ్యుడను! చూచుటకుఁ గన్నులయిన లేవు. (అశ్వపతింజూచి) మద్రభూపాలా ఇటకూర్చుండుము.

భద్రా—పూజ్యవి సావిత్రిలారా! అట నాసీనులగుడు.

ద్యుమ—(అశ్వపతిం గాంచి)

తే. గీ. రాజరాజాధిమహారాజ ♦ రాజనయ్యు
దగినసగౌరవంబున జేయఁ ♦ దగినస్థితిని
గాననంబులయందుంటి ♦ గాయటంచు
మదినిఁ జింతించుచుంటివి ♦ మానవేంద్ర

అశ్వ—భగవంతుఁ డొనర్చినదానికి నీవేమి సేయుదువు మమ్ముల నసలీ ధాత్రిం గాంచి మాకు నీవు గౌరవము సేయనలయునా మేముఁ నీ వారముగామా అందరును గష్టముల గడచినవారేనా కొన్ని దినములు చీకటియు గొన్నిదినములు వెన్నెలయు గాయున ట్లందరును సుఖదుఃఖము లనుభవింపవలసినవారే

ద్యుమ—మే మందు కష్టములు పగవానికైన వలదు

ఉ॥ కన్నులలేక యీకఠిణ ♦ కానసమందు వసింపుచుంటి మో
యన్న యిటుల్ త్వదాగమన ♦ మంచిప మోదము గూర్చె మాకు సం
పన్నుడ వీవు మామగతి ♦ భవ్యముఖంబున గన్గొనక్ శ్రీమం
తెన్నక వచ్చినాడవు ని ♦ జేశ్వరియుక్ జనుదేరఁ గూతుతోక్

మహాదారిద్ర్యసాగరంబున మునింగి దిక్కులేనివారమై యీయ రణ్యమునను న్న మా క్షేమము నారయుటకు నీవుగాక మరెవ్వ రరుదెంతురు భూతలాధిపా ! నిన్ని రేతుల జాయమాన కరుణాకనే కపంకన లక్ష్యించుచున్నవాడను రాజ్యభ్రష్టత గలిగినను, సంఘర్షము సంభవించినను వానింగూర్చి చింతింపక వంశస్త్రాం

కుండగు నీకుమారుని జూచుకొనుచుఁ గాలముఁ గడపుచు
చుంటిని.

అశ్వ—ద్యుమత్సేనా! కష్టము లెప్పుడును మనకడ స్థావరముగా వసిం
పవు. ఇందులకై విచారింపకుము..

ద్యుమ—అశ్వపతీ! మీరెచ్చోటికిఁ బోవుచు నిచ్చటికి గదలివచ్చితిరి
ఎఱుంగనగుదునేని యానతీయుము.

అశ్వ—రాజేంద్రా! మేమిచ్చటికే యరుదెంచితిమి. నారాకకుఁ గారణం
బెఱింగించెదను వినుము.

తే॥ గీ॥ ఈమె నాపుత్రి సావిత్రి ♦ యేను దపము
చేసి సావిత్రివరమునఁ ♦ గాంచినాఁడ
గన్న నీమెను గోడలు ♦ గాగ నీకుఁ
జేసి రాజలోకంబున ♦ వాసిగాంతు.

ఇదియే నా రాకకుఁ గారణము.

గాల—(సత్యవంతునిఁ జూచి) మిత్రమా! వింటివా

ద్యుమ—(అశ్వపతిఁ జూచి) నరపాలా! నాతోఁ బరిహాసోక్తులాడుచుం
టివో లేదో నేనూహింపజాలక యున్నాను. కాకున్న చోదరి
ద్రుఁడై యరణ్యమున మమ్ము సేవించుచున్న నాకుమారునకిప్పు
డు వివాహమేల?

సత్య—(తనలో) ఇందుకుఁ దండ్రిగా రంగీకరింపరా యేమి?

అశ్వ—(ద్యుమత్సేనుం జూ) నృపాలా! నేను బరిహాసోక్తులాడువాడ
నుగాను. నిశ్చయముగనే వక్కాణించితిని. నేను మీ స్థితిఁ జూచి
యిచ్చుటలేదు. సత్యవంతుని గుణశీలముఁ జూచి నీతో వియ్య
మందఁ దలంచితిని. అదియట్లుండనిండు.

తే॥ గీ॥ నీకుమారునేగాని యే ♦ రాకుమారు
బరిణయుఁగాడనంచును ♦ బ్రతినదాల్చె

బరమసుగుణాలవాల యీ ♦ భాసురాంగి
సమ్మతింపుము దీనికై తాన్మతలమున.

తే॥ గీ॥ దానములయందుఁగన్యకా ♦ దాన మరయ
సర్వవిధముల శ్రేష్ఠంబు ♦ తాన్మతలేందరి
దగిన నీసుతునకు నీమె ♦ దానమిచ్చి
యశము నార్జించి వెలసెద ♦ నవనిపాల!

సత్య—(స్వ) నేను మాట్లాడక యూరకున్నచో బాగుండదు. ఇట్లనెద గాక.(ప్రకాశముగా నశ్వపతింగాంచి) మద్రాధిపా?

మ॥ చతురంబోధిపరీతముద్రిమతమహీ ♦ సామ్రాజ్యమున్ బూను నా
క్షితిపాలాగ్రిణు లెందఱోగలుగ సు ♦ శ్రీలెల్లనుంబాసియీ
గతి ఘోరాటవియందు మానికరణిఁ ♦ గాలంబునుంబుచ్చు నన్
బతిగాఁ గోరివరించినన్ నగరె భూ ♦ పాలుర్ ధరాధీశ్వరా!

మాళ—(భద్రాంగినిఁజూచి అమ్మా! భద్రాంగీ!ఈసావిత్రి సత్యవంతునిదప్ప నన్యుల వరింపనని దీక్షవహించినది. సంపదలు లేవనియు. గానలనుంటిమనియు మీరు విచారింపనలదు. ఇందులకు నీవనుమతింపవలయును.

ద్యుమ—(అశ్వపతిఁజూచి) నృపాలా! నాకు మఱియొక యోచనయేమియును లేదు మేము నిరుపేదలమై యీయరణ్యమున దిక్కులులేని పక్షులవలె నల్లాడుచున్నారము. నీ కుమారియీ మిగులను కుమారి ఎన్నఁడును నెండకన్నెఱుఁగదు.

సీ॥ మహనీయ మణిమయ ♦ మందిరంబులనుండు
పడతి యెట్లు వసించు బర్ణశాల
హంసతూలికలందు ♦ నలరారు పూబోడి
దర్భశయ్యను నెట్లు ♦ తనువుఁజేర్చు
వలయునాహారంబు ♦ వాంఛించికైకొను
కాంత దుంపలను మె ♦ క్కంగఁగలదె

పట్టుబట్టలఁగట్టు ♦ భామాశిరోమణి.
నారచీరల మెయిన్ ♦ దాల్పఁగలదె

తే. గీ. సంతతము బరిచారికా ♦ సతులు గొలువ
దనరుమంచెసి లేసు బూ ♦ వనములందు
భయద ఘోరశార్దూల ర ♦ వముల వినుచు
నులికిపడి భయమందక ♦ యుండగలదె ?

మా సత్యవంతుని వివాహము జేసికొన్నందువలన నీమె యేమి సౌఖ్యంబు లాఁదగలదు ?

అశ్వ—రాజేంద్రా! ఈవిషయంబున నీ వానంతయు సందియంబందవలదు. సాధుగుణశీలయగు నీమె పతిని దైవంబుగతి భావించుచు మీపరిచర్యల నేమఱక, మీతోఁబాటు కష్టసుఖముల నందును

ద్యుమ—(కుమారునిజూచి) కుమారా ! సత్యవంతా ! వింటివికదా యీభూపాలచంద్రుని మాటలు? ఇందులకునీయభిప్రాయమేమి

సావి—(తనలో) ఈతఁడేమని చెప్పునో? డెందమా! తొందరపడకుము

అశ్వ—(సత్యవంతునిఁగాంచి) సత్యవంతా !

సీ॥ నినుజేర మనసారఁ ♦ గతిఁ గోరు సావిత్రి
నేలుమీ కరుణ భూ ♦ పాలతనయ
నీకు సేవలజేయ ♦ నిక్కంబుగాఁ గోరు
సారసాక్షిని గావు ♦ సదయహృదయ
నీవె దైవంబంచు ♦ నిజముగా నమ్మెను
కంజాక్షిఁ జేపట్టు ♦ కలుషరహిత
నిన్నెగా కన్యుల ♦ నేగోర నని చెప్పు
సీమంతినిం గొమ్ము ♦ శిష్టచరిత

తే గీ. నామనంబెల్ల నీయధీ ♦ నంబుజేసి
తనరుచుండును వచియించు ♦ తలిరుబోఁడి

బరిణయంబాడి సుఖములఁ ♦ బడయుమయ్య
రాజలోకంబు మిగుల హ ♦ ర్షంబు నంద

గాల—(న్యపుసత్యవంతునిజూచి) మహారాజా సిరిరా మోశాలోడ్డువా రంధునా తానంతటఁ దానరుదెంచి పిల్లనిచ్చెదనని పలుకుచుండగా మీరేమో శొమ్మయెక్క మాట్లాడుచున్నారు. సత్యవంతుని మాన మాతసి యంగీకారమును జూపించుచునేయున్నది. (అశ్వపతింజూచి) అయ్యా అశ్వపతిభూపాలా వీరి వారితో బనేమున్నది పిల్లకును బిల్లవానికి నిష్టమున్నజాలును. ఇంకమీరు సంశయింపనక్కరలేదు.

శా॥ శ్రీమంతుండు శుభప్రచారుడు దయా ♦ శీలుండు పంచేషు శే
ఖా మాధుర్యధురంధరప్రోజ్జ్వల శుభా ♦ కారుండు సం
గ్రామోదారుడు, శౌర్యశాలి, త్రిజగ ♦ త్కల్యాణచారిత్రుడీ
భూమీశాగ్రణినందనుం డీకభవ ♦ త్పుత్రికిఁ గానుకఁ భూవరా

భద్రా—(పతించూచి) ప్రాణేశ్వరా ముద్దుముద్దుగా మన కుమారునకు బిల్లనిచ్చెదమని వీరువచ్చిరి. అందరు మరియొక తీరుగా మనము చెప్పుట భావ్యముగాదు. (మాళవింజూచి) అమ్మా మాళవి మీయభీష్టమెట్లున్నదో యట్లేకానిండు

ద్యుమ—రాజేంద్రా మాకున్నకష్టములు, గూర్చి జెప్పితిని. నీవన్యథాదలంపవలదు నీయభీష్ట మెట్లున్నదో యట్లుకానిమ్ము. కాని నీతోయొకటి చెప్పవలసియున్నది వివాహమునకు మేమీస్థితిలో మీనగరమునకు రాజాలము.

అశ్వ—సమస్తసన్నాహములతోడను నేనేవచ్చియుంటిని నాతో భూసురులు గూడ వచ్చియుండిరి, వారితో, దగిన శుభలగ్నమును కూర్చియాలోచించి వివాహకార్య మచ్చటనే నెఱపెద. ఇంక మనము శత్రుప్రయత్నమున నుండవలయునుం రండు.

సావి—(తనలో) నేటికిగదా నేను ధన్యనైతిని.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

[రంగము:— ఆశ్రమము. ప్రవేశ-అశ్వపతి, ద్యుమత్సేనుఁడు, మాళవి భద్రాంగి, సావిత్రి, సత్యవంతుడు, గాలవుఁడు]

అశ్వ— [సావిత్రినిజూచి] అమ్మాయీ! సావిత్రీ! సత్యవంతునిదప్పయు న్యుల వివాహమాడనని తలంచిననీతలం పౌనఁగూడినది. నీకను రూపుండగు వరుండు లభించినందులకు మాకును మిగుల సంతోస మయ్యె.

గాల— అశ్వపతిరాజా! నీకుమారుని యొక్క పూర్వజన్మపుణ్యపరిపాకంబు జేసి సత్యసంధుండును, ధర్మమూర్తియు, పితృమాతృభక్తిపరిపూ ర్ణుండును, బరాక్రమశాలియు, నిగర్వచూడామణియు నగుమా సత్యవంతుడు నీకు జామాతయయ్యెను. నీకు కన్యాదానఫలము దక్కినది.

సీ. సర్వలోకానంద ♦ సంపాదకక్రియఁ
దావిత్రోఁ గుసుమంబు ♦ దనరినట్లు
నరనాథచంద్రిస ♦ న్మాన్యమై శోభయు
మానికంబును నేక ♦ మైనకరణి
శ్రుతి కనుకూల వ ♦ ద్ధతిగల్గి వాగర్థ
ములు పరస్పరమును ♦ గలియుతి
జగదవనోత్సాహ ♦ సన్నద్ధసంపద
శ్రీసతియుఁ బతియుఁ ♦ జెలగువగున

తే. గీ, వరలుదురుకాక సతతంబు ♦ భవ్యభోగ
భాగ్యసంతానకీర్తి ప్ర ♦ వర్తితోడ
ధరణియందున నాచంద్ర ♦ తారకముగ
సంత్యవంత సావిత్రులు ♦ ధర్మకళత్రి!

ద్యుమ— బ్రాహ్మణోత్తముడవైననీయమోఘాశీర్వచనంబు ఫలించు గాక

మాళ— [సావిత్రినిఁజూచి] అమ్మాయీ! నీకుఁ దెలియనిసంగతులేమి యులేవు. అయిననుఁ గన్నకడుపగుటచేఁ జెప్పుచుంటిని.

సీ॥ జనకుడై నట్టి య ♦ శ్వపతికీర్తిరమకు
వెలలేనివన్నెను ♦ బెట్టుమమ్మ
పతియెదైవమటంచు ♦ భావించిసతతంబు
చిరకీర్తినందుచు ♦ వెలుగుమమ్మ
భవదీయగుణములు ♦ పరికించి తోడిభా
మలు నేర్చుకొనునట్లు ♦ మెలగుమమ్మ
అత్తమామలసేవ ♦ నాత్మలో మఱువక
వారిసేవింపుచు ♦ బరగుమమ్మ
తే॥ గీ॥ మనకు నలువేల్పుసావిత్రి ♦ మఱువకమ్మ
సత్యమేజయమనుమాట ♦ జరుపుమమ్మ
కష్టసుఖములు సమముగాఁ ♦ గడపుమమ్మ
పృథ్విపతిపుత్రిననుచు గ ♦ ర్వింపకమ్మ.

అశ్వ—పుత్రీ!

మ॥ అనిశంబుం బతిసేవఁజేయుచుఁ దదా ♦ జ్ఞాయత్తచిత్తాబ్జవై
యనువర్తించి పతివ్రతామణులనం ♦ ఖ్యాతిం భువిం గాంచి రా
యనఘస్వాంతలు సద్గుణాఢ్య లనసూ ♦ యారుంధతీభామలం
గని నీ వట్లొనరించి కీర్తిని గొనం * గాఁజెల్లు మెచ్చన్ జనుల్.

అమ్మా పతిసేవయే కాంతకు భూషణము. దానిచే సాధింపఁబడని కార్యమేదియు లేదు. సమస్తమును నీకుఁ దెలిసియే యున్నది.

సావి—తల్లిదండ్రులారా! మీయాజ్ఞలను నేను శిరమునధరించెదగాక! గాని నన్ను గని, పెంచి పెద్దదానిగజేసిన మిమ్ముల నెడబాయ వలసి వచ్చెనుగదాయని నేను విచారింపుచున్నాను.

మాళ—తల్లీ! నీవు దీనికై విచారింపవలదు. లోకంబున స్త్రీలందరకు నిట్టిది సహజమైయున్నది. నాలుగురోజుల కొకసారి నీకుశలము విచారించి వచ్చుచుండుటకు దగినసేవకుల నియమించెదను, ఇం

కొంకట్టిమాత్రము నీకుఁ జెప్పుచున్నాను.

తే॥ గీ॥ కాననము దీని నగరంబు ♦ కాఁగఁ బర్ణ
శాల మేలైన మణిమయ ♦ సౌధముగను
కష్టసముదయంబెల్ల సౌ ♦ ఖ్యమ్ములుగను
నాత్మఁ దలపోసి ముదమున ♦ నలరవలయు॥

(భద్రాంగినిజూచి) అమ్మా! భద్రాంగిదేవి? పెంచి పెద్దదానిగ జేసి మీచేతులలోఁ బెట్టితిని. ఇంక నీమెను రక్షించు భారము మీదై యున్నది.

భద్రా—తల్లీ! నీ పుత్రికను నాప్రాణములతో సమానముగ నరసి రక్షించెదను. ఈమె విషయమై నీవు బెంగఁగొనవలదు.

అశ్వ—(సత్యవంతునిఁజూచి) సత్యవంతా! నిన్నుదప్ప నన్యుల వరింపను ని ప్రతిన వహించిన యీమె నిన్నుగైకొన నోచినది. ఇప్పుడీమెను నీ చేతులయందుఁ బెట్టితిని.

ఉ॥ ఆకలిఁగొన్నఁ దా నడుగ ♦ దన్నము, గుత్తుక యెండియుండినం
గైకొనబోదు దాహమును ♦ గన్గొని మేమె యొసంగగావలెః
శ్రీకర! సత్యవంత! గుణ ♦ శేఖర! నిర్మలచిత్తమైన యీ
రాకశశాంకబింబముఖి ♦ రమ్యచరిత్రను నెట్లు బ్రోతువో॥

సత్య—మామగారు! వివాహకాలమున నగ్నిసముఖమున నెట్టిబాసలు నాచేతఁ జేయబడినవో, యట్టివానికి నేను బద్ధుడనైయుందునని తలంపుడు.

అశ్వ—(ద్యుమత్సేనునిం గాంచి) నృపచంద్రా!

తే॥ గీ॥ కాంత యీమెకోడలై ♦ గాత్రి నిపుడు
నీసుతుండు సత్యవంతుపైఁ ♦ నెరుపుప్రేమ
నెఱపుమీ దీనిపై నీవు ♦ నిశ్చయముగ
నింతవిడనాడి పురికేఁ ♦ జేరువాడ.

ద్యుమ—మా సత్యవంతుఁడొకటియుఁ నీవె తెయొకటియునా! మీరట్లు చెప్పనక్కరలేదు.

అశ్వ—(సత్యవంతునిజూచి) ఇంక మేము ప్రయాణసన్నాహము జేసి కొన వలయుగదా! రండు

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

సావిత్రీనాటకము

తృతీయాంకము

రంగము:—[ఆశ్రమమున నొంటిగా సత్యవంతుడు
ప్రవేశించును]

సత్య—(స్వగతము) ఆహా! ఈ దుర్దినము లింకను మమ్ము వదలి పోవు కాబోలు! నామాట కేమి, నేను బుద్ధి యెఱింగిన నాటనుండియు నరణ్యములందే పితృమాతృచరణసేవాసక్తుండనై యుంటిని. కాని సావిత్రినిం జూచిన నాకెంతయు విచారమగుచున్నది.

సీ॥ పరిచారికాజనుల్ ♦ నిరతంబు గొలువంగ
బరమసుఖంబందు ♦ భాసురాంగి
యిష్టమృష్టాన్నంబు ♦ నింపార భుజియించి
భోగియై బొల్చెడు ♦ పూవుబోడి
చేటిజనంబులు ♦ చేరి వెన్నంటరా
వనముల విహరించు ♦ పద్మనేత్రి
భాసురమణిమయ ♦ ప్రాసాదములయందు
హంసతూలికలందు ♦ నలరు సతివ

తే. గీ. ఎండకన్నును నెఱుంగని ♦ యింతిమిన్న
కటకటా! నాకతంబున ♦ కానడవుల
బడగరానట్టి కష్టము ♦ పడుచునుండె
జూచి భరియింపజాలకుంటి ♦ సుదతి నిపుడు॥

ఆశరదిందుపూర్ణిమానబింబవదన, ఆసరసీరుహాక్షి, ఆకోమల సుకుమారశరీర వడుసవస్థలను నేను జూడలేకయుంటిని. తల్లిదండ్రుల సేవలయందు నేనేమి కష్టపడుదునోయని తలంచి, నాకు శ్రమకలుగకుండ ననుదినంబును నాకంటెముందుగా లేచి,వారలయెడఁ జేయవలసిన కృత్యంబులన్నియుఁ జేసి యనంతరము నా సేవయందుఁగూడ నేమరకయున్నది. ఈమెశతమునఁ దమ వంశము పావనంబైనదని మాతలిదండ్రులుసంతసించుచున్నారు ఇన్నిటికేమి, క్రూరసత్త్వభయంకరమైనయిమ్మహారణ్యావాసము నగరవాసమనియే తలంచుచున్నది. ఈ పర్ణశాల తనకుదివ్య మందిరమువలె సంభావింపుచున్నది. ఈకఠిన పాషాణవేదికలు తనకుఁ బూవుల సెజ్జవలె నెంచుచున్నది. మాతోఁ బడుకష్టము లన్నియు సుఖముగా భావించుచున్నది. ఆహా!ఉత్తమస్త్రీయన నిట్టిదేకదా!

మ. పతిభక్తికిఁ సుజనానురక్తిహితవాక్యాండిత్యశక్తికిరమా
సతికిఁ దోడనఁజాలి సాధుసుమన స్సంస్తూయమానం బనా
రతపరిష్ఠవు నయ్యు రూపమహిమకున్ రంజిల్లి యబ్జారికిన్
జతగా వర్ధిలు నీసరోజముఖి నెన్నన్ శక్యమే యేరికిన్

నాపూర్వపుణ్యవశంబున నాకిట్టిభార్య లభించెనని నేనుగర్వింప వలసియున్నది. (ఎదుటఁజూచి) అదుగో! నామనోధనంబగు సావిత్రి యిక్కేవచ్చుచున్నది.

తే. గీ. పసిఁడిచేలంబు ధరియించు ♦ పడతిమిన్న
నానిమిత్తమిూ తెఱగున ♦ నారచీరెఁ
దాల్చి మానికన్యక వోలె ♦ దనరుచుండు
ధాతవ్రాతను నెవ్వారు ♦ దాటగలరు.

ఈమె మృదుభాషణములేమి ఈవినయాదిగుణములేమి ఈమె సేవేలేమి మా రాజ్యభ్రష్టతను వనవాసమునుగూడ మఱపించుచున్నవి

సావి—(ప్రవేశించి తనలో)

తే॥ గీ॥ భాగ్యమన్నను నాదెపో ♦ భాగ్య మరయ
స్వాంతమున నేను గోరిన ♦ సత్యవంతు
బరిణయంబాడితిని దేవి కరుణ వలన
కలరె ననుబోలు ధన్యులు ♦ కాన్తలయందు॥

(ఎదుటజూచి) అదిగో నామనోహరుండేదియో దీర్ఘాలోచనము సేయుచున్నాడు సమీపించెదగాక (సమీపించి) ప్రాణేశ్వరా

సత్య—సతీమణీ ఇచ్చటికేల యరుదెంచితివి ?

సావి—అత్తమామలకు జేయవలసిన బరిచర్యల జేసి యాశ్రమమున గార్యము లన్నియుఁ జక్కబెట్టి నీవెయ్యెడ కరిగితివోయని యరయుచు వచ్చితి. (ఇంచుకయూరకుండి) నాథా! నీవేలోలకో దీర్ఘాలోచన తత్పరుఁడవై గానుపించుచున్నావు. కారణం బరయ వచ్చునా?

సత్య—నాకు నీవిచారము దప్ప మఱియొండు లేదు.

సావి—దేవా! అట్లు సెలవిచ్చెదరేమి? నామూలముననే నీకు విచారమా! నేను నీయెడ బుద్ధిపూర్వకముగ నెట్టి యపరాధమునుజేసి యుండలేదు. తెలియక యేమైన గావించి యున్నచో నయ్యది తెలిసిన సవరించుకొందును.

సత్య—రమణీ ! నీవు నాయెడల నెట్టి యపరాధమును గావించి యుండ లేదు.

ఉ॥ కోమలి బేల కానబడు ♦ గుంజడదారి విధాననున్న న
న్నీమహిఁ బెండ్లియాడి, సుఖ ♦ మింత యెఱుంగక యిట్టిలల ను
ద్దామవనాళి నుంచి, ము ♦ దంబున నేఁజూక భూరిరాజ్య ల
క్ష్మీ మహనీయుఁ గైకొనిన ♦ జెందవుగా యిటువంటికష్టముల్॥

సత్యవంతుఁడే నా మనోహరుఁడు అతనిం దప్ప నన్యులను వరింప నని నన్ను వివాహమాడి నీవు పడుచున్న సుఖములివియే కదా ! ఇట్టి మహాకష్టములఁ బొందుచున్న నిన్నుజూచిన నాకు విచారముగాక సంతోషము గలుగునా ?

సావి—మనోహరా ! ఇదియా నీకుఁగల్గిన విచార కారణము? అట్లయిన నీవు నన్ను గూర్చి విచారింప నవసరములేదు చంచలంబగు రాజ్యలక్ష్మినిగాని యశాశ్వతంబగు భోగంబులను గాని చూచి నిన్ను వరించలేదు. నీతోఁ బాటు కష్టసుఖముల నందుటకే నిను బరిణయంబాడి కృతార్థురాలనైతిని నాకు నీపాదసేవత్ప తక్కిన వేవియు నవసరములేదు కష్టమువచ్చినప్పుడు చింతింపక, సుఖము గల్గినప్పుడు సంతసింపక యెప్పుడును నొకతీరుననుండువారే ధన్యులు. నగరంబున నుండి, మహాభోగములందుచు నది చాల దిది చాలదని చింతింపుచుండుటకన్న నాకీ యరణ్యవాసమే పరమ సుఖదంబుగ నున్నది.

సత్య—అన్నులమిన్నా ! అమృతమును స్రవింప చేయుచున్న నీమృదు మధుర వాక్యములు నాకెంతయు నానందముఁగొలిపి, కష్టముల మఱపించుచుండినవి.

సావి—(స్వగతము) అక్కటా! నేను సత్యవంతుని వివాహమాడి సుఖమునుఁ బొందుచుఁ గాలమును మరచిపోయితిని. నారదుఁడు వచించినట్లీతని యాయుర్దాయమిక మూడుదినములుమాత్రమే యున్నది. ఇంక నేనీతని నొకనిమిషమైన నెడబాయక యీ మూడు దినముల నుపవసించి యిష్టదేవతయగు కాత్యాయనీ దేవిం గొల్చుచుండవలయును. ఆహా! సౌఖ్యమన్నది. దేహమును మరపించును గదా. ఇంక నేను భక్తిపూర్వముగా సమస్త దేవతలను నారాధింపవలయును, (అంబనుద్దేశించి)

శా॥ ఓ కాత్యాయని! నిత్యమంగళకరీ! ♦ యోశాంభవీ! పార్వతీ!
సౌరాశీ! హిమశైలజా! గుణమణీ! ♦ యోపాపవిధ్వంసినీ!

పాకారిప్రముఖామరార్చితమహా పాదద్వయీ ! శాంకరీ !
నాకాంతుఁగృప నేలమీయని నినుఁ గాంక్షింతు దాక్షాయణీ.

సత్య—(సావిత్రిం గాంచి) సతీ ఇంతకు ముందు జరుగవ్వులొలుకుచున్న నీ మొగం బింతలోనే వాడిన దేమికారణము?

సావి—(తనలో) నాచిత్తమున నీతని విషయమై గలిగిన సంతాప మొక్కింతయు బయలుపెట్టరాదు. (ప్రకాశముగా) నాథా ! నీకట్లు గనుపించినది కాబోలు నీవుండనున్న నాకు విచార మేల !

(లోపల అమ్మా ! సావిత్రి)

సత్య—అదిగో ! అమ్మగారు పిలుచుచున్నారు పోవుదము రమ్మి.

(నిష్క్రమింతురు.)

రంగము—(ఆశ్రమమున —ద్యుమత్సేనుడు)
భద్రాంగి, సావిత్రి)

భద్రా—(సావిత్రిం జూచి) అమ్మా ! సావిత్రీ మహారాజపుత్రికవై పెక్కుభోగంబులందు నీవు, కాలస్థితినిబట్టి దరిద్రులముగా మారిన మాయొద్దనుండి యనేకకష్టములఁబడుచుండుటయేగాక, శుష్కోపవాసంబున శరీరమేల యీరీతి గృశింప జేసుకొందువు రెండుదినంబులనుండి భోజనంబొల్లక యిట్లు దీక్షనిష్ఠతో నుండుటకు గారణమేమి తల్లీ ఈపూట భోజనము సేయుము.

సావి—అత్తగారూ నేనిష్టదేవతయగు మహాదేవింగూర్చి త్రిరాత్రోపవాస వ్రతమునుబూనినాను; ఈరాత్రి యొకటిగడచినచో వ్రతము బూర్తియగును. రేపె నాల్గవదినంబగుటచే నుదయంబున పారణ జేసెదను.

భద్రా—అట్లయిన నతినిష్ఠతో జేయు నీవ్రతమునకు మేము భంగము గలిగింతుమా

(సత్యవంతుడు ప్రవేశము)

సత్య—(తనలో)

సీ. అనుదినంబును వెంట ♦ పనిజేయుచుండెడు
నాతి రాకుండె రె ♦ న్నాళ్ళనుండి
మనసిచ్చి మాటాడు ♦ మానవతీమణి
మధురసంభాషణ ♦ మానియుండె
పెంపుకు లేడికి ♦ బ్రీతినన్నము పెట్టు
మగువదానినోసప్పు ♦ మఱచియుండె
శారికాసమితిని ♦ సంతోషమునజూచు
తరుణి వానిదెసకు ♦ నరుగకుండె

తే. గీ. మగువయెట్టున్న నత్తమా ♦ మలసపర్య
మాత్రము మనంబులోన నే ♦ మరకయుండె
రెండునాళ్ళయ్యె నుపవాస ♦ మొండి లేను
కారణ మదేమొ దీనికి ♦ గానరాదు

ఈ తరుణీశిరోమణి నేటికి భుజించి రెండుదినము లయినది ఇట్లుండుటకు గారణము నేనేమని యూహింపగలను తన హృదయమున నభిప్రాయ మొక్కింతయైనను బయలు పెట్టక యీమె యతినిష్ఠాగరిష్ఠయైన పరమయోగిని చందమున గన్పట్టుచున్నది ఈమెను జూచిన నాకెంతయు జాలి కలుగుచున్నది. పట్టెడన్నము దినుమని యెంత బలవంతపఱచినను దినకున్నది ఫలహారమైన నొల్లకున్నది నీరంబుల ద్రావకయున్నది. నిద్రకు దూరమైనది ఆహా

తే॥ గీ॥ పడతినెమ్మోము నిశియందు ♦ బద్మమట్లు
వాడియుండెను కనినోప ♦ వాసమునను

అఖిల సౌఖ్యములందుచు ♦ సలసనట్టి
యువిద లట్టి కష్టంబుల ♦ కోర్వగలరె.

(ఆలోచించి) నేను ప్రస్తుత కార్యంబును మఱచితిని. ఆశ్రమమున నింధనములు లేవు. గొడ్డలిగైకొని యరణ్యమున కేగి కట్టెలఁ దేవలయును. (తండ్రిని సమీపించి) తండ్రీ!

ద్యుమ—కుమారా! వచ్చితివా! ఎచ్చటికిఁ బోయియుంటివి :

సత్య—ఈయాశ్రమప్రాంతమున నే మన హరిణమును మేపుచుంటిని. (ఇంచుక యూరకుండి) తండ్రీ! నేనింధనములకై యరణ్యంబులకరిగి వచ్చెదను. మీరు జాగరూకులై యుండుఁడు.

ద్యుమ—వత్సా! పోయిరమ్ము మనయవస్థ యిట్టు వచ్చినది.

సావి—[తనలో) నారద మునీంద్రుఁడు వచించిన ట్లీతనిగడువు దినంబు నేడేయైయున్నది. నాసమస్తదేవతారాధన వ్యర్థమైనది. ఇప్పుడితఁ డరణ్యమునకుఁ బోవుచున్నాఁడు. నేడీతని నెంతమాత్రమును విడిచి యుండరాదు. కావున నేనుఁగూడ నీతని వెంట నరిగెదగాక. (ప్రకాశముగ సత్యవంతునిఁజూచి] ప్రాణేశ్వరా! నేడు నీతోఁగూడ నరణ్యమున కరుదెంచుటకు వేడుక యగుచున్నది. కావున నన్నుఁ గొనిపొమ్ము.

సత్య—రమణీమణీ! నీకోరిక యతి స్వల్పమయినదే. కాని.

మ. ఉపవాసంబున డస్సియుంటివిగదా ♦ యుగ్రాటవిఁ జేరగాఁ
జపలాక్షీ మణియెంతయున్ శ్రమయగున్ ♦ జాల్ చాలు నీకొక్కెదు
ష్టపథంబందుఁ జరింపఁజాల విటుక ♦ ష్టంబేలపొందఁగ నే
నిపుడే వచ్చెదఁ దప్ప కీవు విన మా ♦ యేణాక్షి నామాటలన్.

సావి—నాథా! ఆవిపినము సమస్త తరులతాశోభితమై యొప్పారుచుండును. నేనెన్నఁడుసు నిన్నఁ గోరియుండలేదు. నేను నా ముద్దు నిపు తప్పక చెల్లింపవలయును.

సత్య—అమ్మలుమినాన్నా నీవు వచ్చుటచే నా కేమిధమయిన భారమును లేదు. ఉపవాసమున మిగుల డస్సియుంటివిగదా? యని యట్లు వచించితిని.

సావి—

తే॥ గీ॥ భవ్య భవదీయ సత్పాద ♦ పద్మసేవ
మఱగియుండిననాకు నే ♦ కొఱతలేదు :
కలుగునేనాకునుపవాస ♦ కారణమున
బడలిక శరీరమందు నో ♦ ప్రాణనాథ!

నన్నుఁగూర్చి సంశయింపక వెంట నరుదెంచుటకు సెలవిమ్మా.

సత్య—అట్లె కానిమ్మా. నీయత్తమామల యనుజ్ఞఁ బొందిరమ్మా. నేను గొడ్డలియుఁ దాడును బుచ్చుకొని వచ్చెదను.

(నిష్క్రమించును.)

సావి—అత్తమామలారా ! మీ కుమారునివెంట నరణ్యమున కరుగుటకు నానతిండు.

ద్యుమ—అమ్మా! ఆయాసపడుదువను సంశయము దప్ప మఱేమియును లేదు. మగనితో నరుగుటకుఁ గుతూహలము జనించిన నిన్ను వారించుటకు మాచిత్తముసమ్మతింపదు. కావునఁబోయి రమ్మా.

భద్రా—తల్లీ ! సావిత్రీ ! అరణ్యంబునఁ దడవుసేయక సత్వరమ్ముగ రమ్ము. నిన్నుఁగాని సత్యవంతునిఁగాని యొక్క నిమిషము జూడకుంటినేని నాడెందమున నాందోళన జనించును. భద్రముగ బోయిరమ్మా.

(అందఱును నిష్క్రమింతురు)

రంగము[---అరణ్యము-ప్రవేశము:

(సత్యవంతుఁడు, సావిత్రి.]

సత్య—రమణీమణీ! ఈ యరణ్యప్రదేశ మెంతరమణీయముగనున్నదో గంటివా? ఇందలి వృక్షములు మార్గాయాసమున డస్సియున్న పాంథులకు నెంతయు జల్లని నీడ నిచ్చును.గదా! ఈయరణ్యమంతయు స్వాభావికమైన సౌందర్యమున మించియున్నది. ఇందలి విహగ మతిప్రమోదావహము గదా. కావలయుననినాటించిన పుష్పతరులతామయమగు నుద్యానవనమందలివిహారమింత సౌఖ్యజనకముగ నుండదుసుమీ! అదిగో! ఆ లతాకుంజంబు లెట్లు వరలుచున్నవో! మన మొక్కింతకాల మిం దాసీనులమై చల్లగ వీచుచున్న యీ మందమారుత సౌఖ్యము ననుభవింతమా! ఇటుచూడుము, ఈరెండు కొండల నడుమనుండియు నా నది యెట్లు ప్రవహించుచున్నదో!

సావి—(తనలో) ఆహా! ఈ పుణ్యమూర్తి ఈసుగుణాలవాలుఁడు దనకు సంభవింపనున్న యాపద నెఱుంగక యిట్లు వచింపుచున్నాఁడు, ఇట్టిసమయమున నాకీ వనవిహారమునం దిచ్ఛజనించునా! (ప్రకాశముగా) నాథా! ఆసదివఁకజూడుఁడు.

శా. గాంగేయప్రభదాల్చి సాయమున రం ♦ గత్తుంగభంగార్భటీ
సంగంబైన ప్రవాహమందున సుచి ♦ స్ఫారుండు సూర్యుండు చ
క్కంగన్పట్టెడు భూమికన్నియ కలం ♦ కారంబుగా జేయఁ బ
ల్కంగల్పించిన కుంకుమోయనగ రా ♦ కాచంద్రబింబాననా

ఇంత ద్వరలో సూర్యుఁ డస్తగిరి జేరగలఁడు కావున మనము త్వరగా నాశ్రమమున కేగుదము మనము వచ్చి చాలా సేపైనది. వనవిహార మిఁక చాలును. ఓ తలిదండ్రులు మనకై వేచియుందురు. గమ్యా.

సత్య—చెలీ! నేనీ వనవిహారసౌఖ్యము ననుభవించుచు నిక్కడనుట

యమైమమఱచితిని. అదుగో! మనకెదురగ నొక యెండిన వృక్షము గనుపించుచున్నది. నేను దాని నీ గొడ్డలితోఁ జీల్చి కట్టియలుగాఁ గొట్టి మోపుఁ గట్టుకొని సత్వరమ్ముగ వచ్చెదను. నీ వీ చెట్టుక్రింద నుండుము.

సావి—నాథా! శీఘ్రముగ రావలయును.

సత్య—ఇదే వచ్చెద. (నిష్క్రమించును.)

సావి—(తనలో) అక్కటా! ఏమికారణమోగాని యిప్పుడు నా యెడమ కన్నదరుచున్నది. ఏమి యశుభము వాటిల్లునోగదా! మేము వచ్చునప్పుడు మార్గమున నన్నియు నపశకునములే సంభవించినవి: కాని ధైర్యమవలంబించి వచ్చితిని సమస్తదేవతలును నానాథుని రక్షించెదరు గాక!

సత్య—(వృక్షముయొద్దనుండి) హా! ఏమిది! సహస్రమదగజసత్వుండనైన నే నిప్పుడు మిగుల బలహీనుఁడనగుచు గట్టియలఁ గొట్టలేకుంటిని. చేత గొడ్డలి నిలుచుటలేదు. సకలదిక్కులు, లోకము, భూమ్యాకాశములు నంధకారబంధురమై గానుపించుచున్నవి. ఏమి? ఈతలనొప్పి బాధ! అబ్బా! నిలువఁజాలకి యున్నాను హా! సుదతీ? (గొడ్డలి నేలపై బడవేయును.)

సావి—నాథా! ఇదే వచ్చుచుంటిని. (సమీపించి) ప్రాణేశ్వరా! ఇదేమి ఇంతలో నిట్లయితిరేమి

సత్య—(దీనస్వరముతో) అయ్యో సావిత్రి నాశరీరమంతయుఁ గంపమెత్తుచున్నది. నాయొడలు వశమగుటలేదు సర్వేంద్రియ సంచారము తగ్గుచున్నట్లున్నది. అబ్బా తలనొప్పి బాధ భరింప శక్యముగాకున్నది. శిరమంతయు గొడ్డలితో నలుగగొట్టుచున్నట్లున్నది! అక్కటా! నిలువజాలను. ఇంక మాతల్లిదండ్రులను జూడను గాబోలు! సావిత్రి ఇంక నిను నెవ్వరు దిక్కు అంధులైన తల్లిదండ్రులెక్కడ?

సావి—(తనలో) ఆహా ఎంతలో నెంతపుట్టినది ఇది నాయంతమునకుఁ గారణముగాబోలు! (ప్రకాశముగా) నాథా ఇంచుక నీవు నా యంకతలమున నీ శిరముఁ జేర్చి పరుండుము. కొంతబాధ తగ్గఁగలదు

సత్య—అయ్యో! ఎక్కడి బాధతగ్గుట! (సావిత్రితొడపైఁ శిరముజేర్చి) నాలుక లోపలికి దిగిపోవుచున్నది మాటవచ్చుటలేదు కన్నులుమూసికొని పోవుచున్నవి అదిగో నీలజీమూతసన్నిభశరీరుఁడగు నొకఁడు నన్ను బాధింపుచున్నాఁడు అయ్యో! ప్రియా! ఏమిగతి (మాటలేక పడియుండును.)

సావి—హా! నాకీగతి యేమి! నే నిప్పు డేమిసేయుదాను. పార్వతి (నుద్దేశించి) హా! భవానీ!

చ. నిరుపమభక్తిబూనుచును ♦ నిత్యము నాదగు చిత్తమందు నీ
చరణపయోరుహంబులను ♦ సంతసమేర్పడఁ గొల్చుచుంటి నీ
వరకరుణారసంబునను ♦ బాలనజేయుచు నిప్డు నామనో
హరునకు భాగ్యసౌఖ్యము ♦ నావదఁబొందితి నీకు మ్రొక్కెదన్

(సత్యవంతునిపైఁ జేయివైచి) ఏమిటి! శరీరమంతయుఁ జల్లబడుచున్నది. నాథా! నాథా ? (ఇంచుక యూరకుండి) అయ్యో! మాటలాడవేమి ; ఇక్కటా ? నీవు నాదెసఁ జూడకయున్నచో నా గతి యేమి కావలయు? నీవు లేని నాకీజన్మమేల? పోనిమ్ము వివాహమాడిన నన్ను జూడకున్నను వృద్ధులై యంధులై, నిన్నుఁజూచుకొని యరణ్యమున దినములఁ బుచ్చు నీ తల్లిదండ్రుల మఱచితివా! నీవుగాక వారికెవ్వరు సేవజేయుదురు ? (ఇంచుక యూరకుండి] ప్రాణేశ్వరా ! (అని పిలిచి) అయ్యో! ఇంకెక్కడి ప్రాణేశ్వరుఁడు

సీ. అర్ధాంగినో నన్ను ♦ నడవిపాల్గావించి
యరుగుట ధర్మమా ♦ వరగుణాఢ్య

తల్లిదండ్రులసేవ ♦ యుల్లమందు మఱచి
దీర్ఘనిద్రిఁ గ్రుంగంటె ♦ ధీరచరిత
ఎన్నండు నిను బాసి ♦ యెఱుఁగని హరిణంబు
దాసికి దిక్కేమి ♦ ధర్మమూర్తి
ముని బాలకులమాట ♦ మనమందు విడనాడి
చనినాడవే యిట్లు ♦ సదయహృదయ

తే. గీ హా! మనోనాథ! జితచంద్ర ♦ హాసుచరిత!
హా! ద్యుమత్సేననందనా! ♦ హా! సురూప!
హా! నిరంతరకరుణామయ ♦ సూంతరంగ !
సకలసద్గుణవంత! హా! సత్యవంత

అక్కటా! నారదమునీంద్రుఁడు చెప్పిన వాక్యములు నిజమయ్యెనే ఇప్పట్లు నిన్ను రక్షించువారెవ్వరు ! నా దేవతారాధనమంతయు వ్యర్థమయ్యెనే!

సీ. నిర్మోహమను భూతి ♦ నిండఁబెట్టి సమభావ
కౌపీనవసనంబు ♦ గరిమదాల్చి
సత్యకమండలుఁ ♦ జక్కఁగా జేపట్టి
సత్కృపారసమను ♦ జలముఁబోసి
దాయలాఱ్వురను ♦ దారిఁద్రెంచి
విజ్ఞానపాదుకల్ ♦ వేడ్కఁదొడిగి
సంసారమనెడు సి ♦ స్సారకాననము వి
రాగపరశువున ♦ వ్రచ్చివైచి

తే. గీ. సచ్చిదానందమూర్తివై ♦ చనుమనుంచె
ధరణి సకలప్రదేశముల్ ♦ దాటి దాటి
శాశ్వతానందపదవిని ♦ సౌఖ్యమంది
సకలసద్గుణమూర్తియో ♦ సత్యమూర్తి

(యముఁడు ప్రవేశించును)

యము—(పాశముచే సత్యవంతుని సమీపించును.)

సత్య—హా! హా (మృతుండగును.)

సావి—(సత్యవంతుని శిరము నెమ్మదిగా నేలఁబెట్టి లేచి యముని జూచి) ఓయీ మహానుభావా! నీవెవ్వఁడవో తెలియదు. ఇదిగో నమస్కరింపుచున్నాను. నీవెవ్వరవు? ఎందులకిచ్చ్యేడ కనుపించితివి!

క. వరుఁడిటు తలబాధకతన
ధరపైఁ బడెఁ దాళలేక ♦ తద్దయు మదిలోఁ
గరుణం దలంపుచు మందున
బరిరక్షణ సేతువే మొ ♦ పలుకుము దేవా!

నీరూపము జూడగా నొక్క దివ్యపురుషుఁడవని తోచుచున్నది. ఎవ్వరైననేమి నాపతిప్రాణము రక్షింపవేఁడెద.

యము—తపస్వినీ! నీవు మద్రరాజపుత్రికయనియు, నీతఁడు భవన్నాథుండగు సత్యవంతుడనియు నాకు దెలియును. నేనీతనిని మందిచ్చి రక్షింపదగినంతటి సమర్థుడను గాను. నేను కాలుఁడను. ఈతని యాయువు నేటితో సరియగుటం జేసి యీతని జీవములం గొనిపోవుటకై వచ్చితిని.

(సత్యవంతునిపైఁ బాశముం బ్రయోగించును.)

సావి—హా! యమధర్మరాజా! ఇంత నిర్దాక్షిణ్యము నీకుఁ దగదు. నీవు ధర్మమూర్తివి. న్యాయాన్యాయవిచారణ పారీణుఁడవు. నీవాక్కింత నాపైఁ గరుణబరపవలయును.

ఉ. నిగనిగలాడువాఁడు ఘన ♦ నీరజనేత్రుని బోలువాడు కెం
జిగిబిగిమోవివాడు కృప ♦ చెన్నువహింపఁగ జూచువాడు మేలు
సొగసులుగుల్కువాడు పరి ♦ శుద్ధచరిత్రుఁడునైన నా
మగనిని గావు మిప్పుడు స ♦ మంచితభక్తిని నీకు మ్రొక్కెదన్

యము—తరుణీ! నీవు పుణ్యశీలవగుటంజేసి, మానవులకగోచరమైన

నారూపము నీకుఁ గనబడినది. నీభర్తకు నాయువు నేటితో దీరినది. అతఁడు పుణ్యమూర్తియగుటంజేసి కింకరులను బంపక జీవములను హరించుటకు నేనేవచ్చితిని. హరించితిని. విధికృత్యంబుల జరిగెడుదానికి నీవు విచారింపవలదు. ఇంక నేఁ బోయెద. (నడచుచున్నాఁడు.)

సావి—(వెంటనరుగుచు యముని జూచి) సూర్యనందనా! కరుణాంతరంగుఁడవై నావిన్నపంబొక్కటి యాలకింపుము. సత్యవంతునివివాహమాడి నేటికి వత్సరమైనది. ఈతని పదసేవ నాకింత త్వరలోఁ బాపుట నీకు న్యాయముగాదు. సత్యసంధుడును, సుగుణశేఖరుండును, నగు నీతఁడిట్టి యకాలమరణంబునకుఁ బాత్రుఁడు గాఁడు. అదియట్లుంచుము.

మ. తనయుల్లేనికుటుంబముల్ ♦ ధరణిలో దైవంబు లేనట్టియూ
రును, చంద్రుఁడులేని రేయి, రఘుధీ ♦ రుల్ మానసంబందు గొ
ల్వనిజన్మంబులును, భర్తృహీనయగు నా ♦ పద్మాక్షియుల్ జూడ స
జ్జనబృందంబులచేతఁ జూడఁబడునే ♦ సత్యంబు వైవస్వతా.

అవనిలోఁ బతిలేని సతిబ్రతుకేటికి? దుర్భరంబైన వైధవ్యము భరింపఁజాలను. నాకుఁబతిభిక్షపెట్టుము నీకు నమస్కరించెదను.

యము—సాధ్వీ! నీవు నావెంట గడుదవ్వరుదెంచితివి. నీవిట్లు చింతించుచు నన్ను బ్రతిమాలినందువలన బ్రయోజనమేమియును లేదు. నీపతిజీవంబు లింకయాతనాశరీరమున బ్రవేశపెట్టఁబడును.

మ. సరసీజాక్షుని నాదుమాట వినుమా ♦ చంద్రార్కతారావనీ
శరధిస్థాయిగ నెవ్వరయిన మనగా ♦ శక్యంబె భూమండలిన్
మరణం బెప్పటికైన దేహికిస్థిరం ♦ బైయుండు దానిన్ మదిన్
బరిశీలింపుచు ధైర్యమున్ గనుము భా ♦ వంబందు నిష్పట్టునన్.

మృతుఁడైన నీభర్తనీకు మరల సంప్రాప్తింపఁడు. మంచివారై నను జెడ్డవారైనను కాలమాసన్నమైనంతనే మృత్యుగహ్వరం బున బ్రవేశింపకతీరదు. ఇంక మరలుము. (ఇంచుక నడచును.)

సావి— వైవస్వతా! ఏడడుగులు వెంటనడచిన నెట్టివారైనను బంధువు లగుదురని యార్యులు చెప్పుదురు, నేను నీతోఁగడుదూర మరు దెంచితిని. అట్టిచో నేఁ నీకాప్తబంధువువని వేరె చెప్పనేల ? సహస్ర ధర్మాధర్మవిచారణదక్షత నీయందు మూర్తీభవించుట చేతనే నిన్ను ధర్మదేవతయందురు. ధర్మమూర్తివగు నీసందర్శ నమున శుభములు వడయక నేనెట్లుమరలిపోదును !

మ. పతియే దైవమటంచు జిత్తమున సం ♦ భావించి సేవించు నీ
సతికిన్ గష్టముదెచ్చి పెట్టుదువె నా ♦ సౌఖ్యంబులన్ ద్రుంతువే
పతినిం బాసి శరీరమందు నిక నే ♦ ప్రాణంబులన్ దాల్పనే
గతి జీవింపగనోపు భూస్థలిని వ ♦ క్కాణింపు సూర్యాత్మజా

నీకు తెలియని ధర్మములేమున్నవి ?

యమ— (తనలో) అహా ! ఏమి ఈ గంభీరభాషణములు ! ఈమెవాక్య ములు కఠినమనస్కుఁడనైన నాకుఁగూడ జాలిగొల్పుచున్నవి (ప్రకాశముగ) మద్రరాజాత్మజా !

తే. గీ. భవ్యభవదీయ దివ్యసం ♦ భాషణంబు
మెచ్చుకొల్పెను నాకిప్డు ♦ మచ్చెకంటి
పతివియోగదుఃఖార్తవై ♦ బంగు నీవు
వాసియును దక్క మరొండు ♦ వరమునిప్డు
గోరుకొమ్మిచ్చువాడను ♦ గోర్కెతీరఁ.

సావి— (తనలో) ఈతఁడు మార్గములోనికి వచ్చుచున్నాఁడు. ఎట్లయిన నీతనిని విడువక వెన్నంటి నాపతిని రక్షించుకొనవలయును (ప్రకాశముగా) దేవా నీకు నాయందట్టి యనుగ్రహముగలదేని నపత్యంబుల నంధులైయున్న నాయత్తమామలకుఁ దృష్టిప్రసా

బంచి, దాయులచేఁ జిక్కిన వారిరాజ్యము మరల వారికి గల్గున ట్లనుగ్రహింపుము,

యము—అట్లేయగుఁగాక పోయిరమ్ము.

(నిష్క్రమించి వెంటనే ప్రవేశించును.)

(సావిత్రియు నట్లేచేయును.)

యము—ఇదేమి మరల వచ్చుచుంటివి సురలుము.

సావి—ఎక్కడికి ?

యము—మీ నూశ్రమమునకు.

సావి—ఇట్టిది యెందైన గలదా. పతి యెచ్చటనున్న సతియు నచ్చటనే యుండవలయును గదా ! నీవు కృపాంతరంగుఁడవై నాకుం బతి దానం బొనరించితివేని మరలిపోయెదను. ఈధర్మ సూత్రము నీ వెఱుంగినదే. ఈపతిని విడిచి నేనెట్లు బోగలను. నాయందుఁ గరుణవహించి పతిజీవంబుల నిమ్ము. లేనిచో నాప్రాణములఁ గూడనీ పాశముసదీయుము- ఇరువురమునొకచోటనే యుందుము

యము—నారీమణీ ! రావలదని యెంతచెప్పినను వినవుగదా !

ఉ. ఇచ్చ జనింప నాకుఁదర ♦ శేఖరణ నీకువరంబొసంగఁగా
నిచ్చితి? దాని దృప్తివహి ♦ యింపక నావెనువెంట నిట్లుఁగా
వచ్చెదవేల? వచ్చి పతి ♦ ప్రాణము లీయమః లేకయున్న నీ
జచ్చెడిదానంచుఁగడు ♦ సాహసలీలను బల్కెదేల ! ఆ
చచ్చినవారితోడఁబడి ♦ చత్తురె కాలము జెల్ల కెవ్వరేఁ.

ఇంక మాఱుమాటడక యరుగుము. ఇటుపైనన్న మార్గ మగమ్యము. ఇదయంతయు నెట్లున్నదో చూడుము.

సీ. కాలుబట్టినయంత ♦ కసుగుకసుక్కని
తోచుమనుండెడు ♦ తుమ్మముండ్లు

ఎంతచంపినగాని ♦ మెదుగుచు నేయుండి
బాటకడ్డమునిల్చు ♦ బ్రహ్మజెముడు
ఏగుచో గాళ్ళను ♦ నెదురుదెబ్బలుదాకి
కడుబాధఁగలిగించు ♦ కటికిరాళ్ళు
స్వరము విన్నంతనే ♦ సరగున నఱచుచు
నరుదెంచి పైఁబడు ♦ వ్యాఘ్రచయము

తే. గీ. కలిగినరుఁడు ప్రవేశింప ♦ నలవిగాక
మిగుల భీతిని గలిగించి ♦ నెగడునీయ
రణ్యమార్గ మిక నగోచ ♦ రంబు; గాన
మాటలాడక వేగంబె ♦ మరలుమీవు.

ధాతవ్రాసిన వ్రాతను నెవ్వడును దప్పింపజాలఁడు. గతించిన వానికి వగవంబనిలేదు. వగచినను లాభములేదు. చచ్చినవారి తోడ వెంట నెవ్వరును రారు.

మ. తనువుం బోయినమీఁదటన్ మిగులఁజే ♦ దంబుద్ధులన్ గాటిదా
కనె యేతెంతురుగాదె చుట్టములు బం [illegible] లెవ్వరున్ జీవితో
వెతవెంటన్ జనుదేరఁజాలరుసుమీ ♦ బింబోష్ఠి యీవాక్యమున్
మనమం దెంచుచు ధైర్యమున్ గనుచు, బో ♦ మ్మానీవు నీపేటికిన్.
ఇదే నేబోవుచుంటిని.

(నిష్క్రమించి వెంటనే మరల బ్రవేశించును.)

సావి—(వెంట నరిగి మరల బ్రవేశించును.)

యము—(తనలో, ఈయబలసాహస మచ్చెరువగుచున్నది. నే నెట్టి దుర్గమమైనమార్గమునఁ బోవుచున్నను నావెన్నంటి వచ్చుచునే యున్నది. కానిమ్ము. ఇంచుక భయపెట్టిచూచెదఁగాక! సావిత్రినిఁజూచి) తరుణీ! నేనెంత చెప్పినను నావాక్యములఁ బాటింపక యుంటివి. గతించినవా [illegible] రాగు. జీవకోటి యొక్క ప్రాణముల హరించుటయే నాముఖ్యోద్యోగము. నీవు

మరల నాశ్రమమున కరుగుటకు మిగుల కష్టపడుదువు. ఇంక జన్మంబునఁ నీపతిని జూడజాలవు. అతడు సజ్జనుండగుటంజేసి సుగతి కేగఁగలఁడు. ఇకముం దిదియంతయు యమలోకంబున కరుగుమార్గము. అగోచరంబును, భయంకరమునునై యుండును. అదుగో! అటుఁజూడుము. అయ్యది అసిపత్రివనము. ఇందలి యాకులన్నియు వాడిగల ఖడ్గములవలె నుండి తన్మధ్యము నుండి పోవువారి శరీరమునకు రాచుకొని రక్తము బ్రవహింపజేయును. ఈమార్గముననే నాకింకరులు జీవులను దమపాశములచేఁగట్టి యీడ్చుకొనుచు ప్రేతసమూహముల కావాసమైన యామ్యనగరంబును, గాలదూషక పరిపాలితమగు సౌరియను పురమును, క్రూరము, క్రౌంచము, విచిత్రము, వహ్వాపదము, సతప్తమునను ననేకపట్టణముల దాటించి నాసన్నిధికిఁదోడ్కొని వత్తురు. ఈపురములన్నియు మిగుల భయముగొల్పుచుండును. నీవు నాతో నగుడెంచుచు వృథాయాస మేల బొందెదవు!

(తెరలో కలకలము)

యమ—సతీ! అదిగోజూడుము. నాకింకరులు జీవి నీమార్గమున నెట్లు గొనిపోవుచున్నారో!

(యమకింకరుఁడు, జీవుఁడు.)

జీవు—(తనలో) అయ్యో! ఈయమకింకరుఁడు పెట్టుబాధల సహింపఁజాలక యున్నాను. మార్గమందే యీతఁడిట్లు బాధింపుచున్నాఁడు. ఇంక యముం డెట్లుజేయునో? బ్రతికియున్నప్పుడొక్క భూసురునకైన దాన మిచ్చియుండనైతినే. ఆశ్రయించినవారి కుద్యోగ మీయనైతినే. శాఖాభిమానమని యితరులకు హాని గూర్చితినే. కవులను బండితులను బాదరింపనైతినే. ఆలుబిడ్డలు సత్యులని తలంచితినే.

కిం—పద పద. ఏడ్చిన నేమి లాభము! చేసినపాపము లనుభవింపవలయును. (కొట్టుచున్నాఁడు.)

జీవుడు—అయ్యో! నన్ను బాధింపకుము. నీశూలపోటులకు దాళలేకున్నాను. రక్షింపుము.

కింక—రక్షించుటకు శిక్షించుటకును గర్త వేరొకఁడు త్వరగా నడువు పుణ్యభద్రము వటవృక్షమును సమీపించుచున్నాము. అచ్చట విశ్రమింపవలయును. (జీవుని యీడ్చుకొని పోవుచుని ప్రకాశించుచును.)

యము—శాంతా! కంటివా కింకరుండు జీవుని నెటులీడ్చుకొనిపోవుచున్నాఁడో! ఇంక మాటాడక యేగుము.

సావి—దేవా! నీవుజీవులయందు సమబుద్ధి దాల్చియుందువు ఆ కారణమున నిన్ను సమవర్తియనిరి. అట్టినీవు నాయందుఁ గరుణఁజూపక యుండుట మిగుల వింతగానున్నది సావధానమతివై నాప్రార్థన మాలకింపుము. ఏపాపమును జేసియెఱుఁగని నామనోహరుని జీవంబుల నీవు హరించితివి. దీనివలన నీతనిజీవమే గాక యనేక ప్రాణుల హరించినవాఁడ వగుదువు. నాపతిని నీవు రక్షింపకుంటివేని నీచరణసన్నిధిని నేను ప్రాణముల వాయుదును. మాయిరువురి మరణంబు విని యంధులై యరణ్యమున దిక్కులేకయున్న మాయత్తమామలు మృతులగుదురు. ఇదియట్లుండుము. సంతానమునకై యనేక తపంబులొనర్చి నన్నుఁగాంచిన నాతల్లిదండ్రులకుఁగూడ నావిషయమైన చింతచే నట్టిగతియే సంభవించును. మహాత్మా సమవర్తీ! ఈ దీనురాలియందు గరుణఁబూనుము. సమవర్తియగు నీవు ధర్మము తప్పరాదు. పతితోడనే ప్రాణమని యెంచుచు, నెన్నఁడును నాతనిం బాసి యెఱుంగని నన్ను రక్షింపుము.

యము—(స్వగతము) ఆహా!

తే. గీ. అఖిలమర్త్యులజీవంబు ♦ లపహరించి
గఠినచిత్తుండనగు నాదు ♦ గఠినవాక్య

ములు మిగుల జాలి, కరుణయుఁ ♦ గొలుపుచుండి
చిత్తమంతయు నీరుగాఁ ♦ జేసెనిపుడు.

ఇంతదూర మరుదెంచిన యీ యింతిని వృథాగా మఱలిపొమ్మనుట భావ్యముగాదు. [ప్రకాశముగా] సావిత్రీ! ఎవ్వరికిని నాదర్శనము దొరకలేదు. ఎవ్వరును నాతో నిట్లు భాషింపలేదు. నీ వాక్యజాలము నాకు మిగుల నద్భుతము గొలిపినది. పతిజీవము లందప్ప మఱియొకవరము కోరు మనుగ్రహించెదను.

సావి—(తనలో) ఈమహాత్ముఁ డెన్నఁడు నాయందుఁ గరుణజనించుచున్నది. నా విభుని రక్షించువరకును నే నీతనిని విడువను. (ప్రకాశముగా) దేవా సంయమినీ పురాధీశ్వరా! నీయపారకరుణకు సంతసించితిని. పుత్రసంతానము లేక తపించు నాతల్లిదండ్రులకు బుత్రోదయ మనుగ్రహింప వేడెదను.

యము—తరుణీ! నీతండ్రికి నూర్వురు కొమారు లుదయింతురుగాక! ఇంక బొమ్ము. అకనిపించునది వైతరణీ మహానది. అయ్యది చీము నెత్తురులచే నిండి మహాభయంబును గొలుపుచుండును. దాని నెవ్వరును దాటఁజాలరు; పుణ్యము జేసికొనినవారిని మాత్రమె కపిలగో వయ్యెడ కరుదెంచి తన తోకమూలమున దాటించును. ఇప్పుడు నేను దాని నాకాశమార్గమున దాటి నాపురంబున కరిగెద. ఇంక నీవు తడవు సేయక పొమ్ము.

(నిర్గమించును)

సావి—అయ్యో! నాకా వరంబు ననుగ్రహించి యము డరుగుచున్నాఁడు. నానాథునివిషయమై యీతఁ డించుకయు గరుణించుటలేదు. ఇక్కటా! నే నేమి సేయుదును? ఈ వైతరణీనది నెట్లుతరించి పోవుదును? (ఆలోచించి) ఏమైననుగాని ధైర్యము బూని పితృపతివెంట నరిగెదగాక! (నదిని సమీపించి)

ఉ॥ నారమణుండు సద్గుణగ ♦ ణ స్తవనీయచరిత్రుఁడేని, నే
నే రమణీశిరోమణినై ♦ యేని, మనోహరు పాదసేవనం

పారఁ జేయుదేని జగ◆దంబను గొల్చెద నేఁ గాలునిం
జేరఁగ రింతుగాక కను◆శీఘ్రము వైతరణీమహానదిన్

(దాటుచు నిష్క్రమించును.)

రంగము:—యమపురి ప్రవేశము యముడు

యము—(తనలో) ఆహా ఈ సావిత్రిచర్య నాకు మిగుల వింతగొలుపుచున్నది. మానవుల కసాధ్యమగు నసిపత్రవనంబును, వైతరణియును నాతోఁ బాటు దాటి తుదకు నాపురమునకు గూడ వచ్చినది. కానిమ్ము ఈమె లోనికి బ్రవేశింపకుండ నగరద్వారమును మూయించి, జీవవిచారణోద్యోగమున నుండెదగాక (ప్రక్కఁజూచి,) ఓ కింకరులారా ఆ వచ్చు కాంతలోపల బ్రవేశింపకుండ ద్వారముల మూసివేయుడు.

(నిష్క్రమించును)

సావి—(ప్రవేశించి తనలో) భర్తృసేవాపరతంత్రనగు నేను దుర్గాకటాక్షమున వైతరణీనదిఁ గూడ కింకరులు పురద్వారమును మూసివేసిరి ఇది కాలుని యాజ్ఞయై యుండునోపు. కానిమ్ము ఏదైననేమి ? అధైర్యమునకుఁ జిత్తమున స్థలమీయరాదు. దీననగు నన్నుద్ధరించుటకు జగదీశ్వరియే దిక్కు. పతిని సజీవుని జేయు వరకును పితృపతిని విడువరాదు ఎట్లో మార్గముఁ జేసికొని యముని కొలువుకూటమున కరుగవలయును, (ఎదుటఁజూచి) ఈ నగరద్వారము లాకాశమునంటి యున్నవే. నేనేరీతిని బురప్రవేశ మొనర్చి యముని దర్శింపగలను. అయినను యత్నించెదగాక. (నగరద్వారమును సమీపించి) హే ! కాత్యాయనీ !

ఉ॥ ఏను మహాపతివ్రతన◆యేని. సుధర్మము నెంతు నేని; నా
మానసమందుఁ బ్రాణధవు◆మానక గొల్చెడి దాన నేని; న

న్నాముల నెల్లవేళల స ♦ మంచితభక్తిని చూతు నేని యం
బా నను బ్రోవు మిప్పుడు క ♦ వాటము బ్రద్దలు సేయుచుఁ వెసఁ

[పెద్దధ్వని వినవచ్చును కవాటము బ్రద్దలగును సావిత్రి నిష్క్రమించును]

(అంత తెరలేచును యముని సభాస్థానము.)

(యముడు, చిత్రగుప్తుఁడు, కింకరులు ప్రవేశము.)

సావి—(ప్రవేశించి యమునిఁ జూచి)

తే॥ గీ॥ ధర్మమే నీకు నియ్యది ♦ ధర్మమూర్తి!
యింతదూరంబు వచ్చిన ♦ నింతి చూచి
జీవితేశుప్రాణంబు ర ♦ క్షింపకుండ
స్వస్థచిత్తుడవై యుంటి ♦ సచ్చరిత్ర!

యము—(సావిత్రిని చూచి తనలో) ఏమీ! పరమాద్భుతమైన యీమె మహిమ! తుదకు నాపురంబునకు గూడవచ్చినది. ఇంతకుమున్నే దిరుగా యొక పెద్దధ్వని వినవచ్చినది. అదియీమెమహిమవలన నగరద్వారము బగులుటయని తలంచెదను. ఈమె సాహసమెంత యశ్లాఘ్యము. ఇప్పుడు నేనీమె దెసఁ జూడకుండ జీవవిచారణ మొనర్చెదగాక. అదియంతయుఁ జూచి భయంబందియైన మరలి పోకుండునా? (చిత్రగుప్తునిచూచి) చిత్రగుప్తా! నిన్నవచ్చినజీవులను విచారింపవలయును గదా?

చిత్ర—చిత్తము. (కింకరునిఁ జూచి) కింకరా! ఆజీవునిట్లు దోడ్కొని రమ్ము.

కింక—చిత్తము! (నిష్క్రమించి వెంటనే జీవులతో ప్రవేశించును.)

చిత్ర—(ఒక్కొక్కజీవునిఁ జూపుచు) దేవా! చిత్తగింపుము.

సీ. పాపంబు నెంచక ♦ పరభామలను బట్టి
బలిమి మైగ్రిడించు ♦ పాపియితడు
పతిసేవ నొల్లక ♦ స్వైరిణీ వృత్తిని
బూని చరించెడు ♦ పొలతి యీమె

బ్రాహ్మణధనముల ♦ పహరించి సౌధముల్
నిర్మించినిలుచు ♦ మన్నీఁడితండు
కూటసాక్ష్యములిచ్చి ♦ కొండలదిగమ్రింగి
దరిద్య్రమార్జించు దు ♦ ర్మార్గుడితఁడు
తే॥ గీ॥ జారునింగూడి యుండంగ ♦ సంతసమున
భర్తకు విషముఁబునిచ్చిన ♦ పడతియీమె
ధనము నాశించి కన్యకా ♦ దానఫలము
మరచి, తనకూతునమ్మిన ♦ మనుజుడితఁడు॥
వీరందరకును నెట్టి శిక్షల విధింతువో విధింపుము.

యము—కింకరులారా! మొదట జెప్పబడినయా స్త్రీ పురుషులను తామ్రముతోఁ జేయబడి యగ్నిచుందుఁగాల్చబడియుండు ప్రతిమలను గాఁగలించుకొనునట్లుఁ జేయుడు. బ్రాహ్మణధనంబులపహరించిన యాజీవుని గానుగయందుఁ బెట్టి త్రిప్పుడు కూటసాక్ష్యము లిచ్చిన వారిని రోకండ్లచే మొత్తుడు. భర్తకు విషంబిడిన యాపాపాత్మురాలిని సలసల గ్రాగుచున్న చమురునందు వేయుడు కన్యావిక్రయుని నిచ్చునచ్చిన తేరంగునజేయుడు పొండు.

(జీవులు రోదనము సేయుచు గింకరులతో నిష్క్రమింతురు)

పాపి—(తనలో) ఏమిభయంకరముగానున్నది! (యమునిఁజూచి, ప్రకాశముగా) దేవా! వైవస్వతా! భయము గొలుపుచున్న ఈ జీవులశోకారవములు వినఁజాలను. కరుణ వహించి నాపతిప్రాణముల నిచ్చి నన్ను బ్రోవుము.

యము—అబలా! జేలవై యింకాలీల గోల చేసెద వేల? ఇంత దూరమేల శ్రమపడి వచ్చితివి! పుణ్యవతి యగటంజేసియే రెండువర-

బులిక్పైయుంటివిని తృప్తిపొంది మరలుము, ఘనరక బాధలను నీవు చూడజాలవు. అటు చూడుము.

తే॥ గీ॥ అదియె యంధతామిస్రంబు ♦ సదియె రౌర
వంబు నదియె మహారౌర ♦ వంబు ;

ఈవైపునకు వచ్చి చూడుము. నదియె
ప్రాణిరోధ; తపోర్మియు ♦ వైతరణియు
నదియె సారమేయానంద; ♦ బదిగో ! చూడు
వజ్రకంటక శాల్మలి? ♦ భూమియిపుడు.

ఇట్టి భయంకర లోకంబున నీవునిలువ జాలవు. సత్వరముగ బొమ్ము. ఇంక ననేకజీవుల నీనరకంబులందు బెట్టి కింకరులు బాధింతురు. ఆశోకారావంబులంజూచి నీవు భయంబంది యే మైన నపాయము జెందగలవు.

సావి——మహాత్మా ! వీని నన్నిటిని చూపి నాకు భయము గొల్పకుము. భర్తలేక శక్తిన దేదియున్నను బ్రయోజనము లేదు సమస్తసౌఖ్యములకు నాలవాలమైన పతిసేవను విడచి భూతలమున నేనేగతిం జీవింపంగలను ! పతిలేని సతి బ్రతుకు వ్యర్థముగదా ! ఆర్తరక్షణము నీయం దమరి యున్నది కాని యేకారణముచేత నాయం దింతవఱకును గృపవహింపక యుంటివో యూహింప జాలకయున్నాను. కరుణించి మానవస్త్రీనై నేనింతదూరముపతి నడబాయ జాలక వచ్చితిని గదాయని తలంచి యైనను నాకుం బతిభిక్షం బెట్టుము.

యము——(తనలో) ఈసమయమున నాచిత్తమున గరుణం బ్రవేశపెట్ట రాదు. ఆగ్రహము నటించినగాని బ్రయోజనములేదు. అని వత్రివనమార్గమున రావలసివచ్చినను, వైతరణి దాటవలసిన ప్పుడైనను, నరకలోకబాధలు గన్నులారం జూచుచుండినను నినుమంతియైన స్వాంతమున భయముండదని యీయువతి నా

కోపమునకుమాత్రము భీతిల్లునా ! కానిమ్ము. అప్పటికిని మరలి పోవకయున్నచో పతియొక్కమార్గమును జూచెదఁగాక ! (ప్రకాశముగా కోపముతో) నారీమణీ! నేనెంత చెప్పినను నీవు వినకుంటివి. నాకడసారివాక్యముల వినుము. నాపురమునకు వచ్చుటయే కాదు. నీవు చతుర్దశభువనంబులయందు జరించినను నీపతిని నీవు మరల బడయజాలవు. ఇది ముమ్మాటికి నిశ్చయము. ఇంక నీతో సంభాషించుటకు నాకు వీలులేదు. పొమ్ము.

సావి—పితృపతీ ! నాభర్తను నేనింక మరలఁ బడయజాలనా ? ఎంత నిర్దాక్షిణ్యచిత్తుఁడవు ! విరించి నీహృదయమును కఠినపాషాణతుల్యముగఁ జేసెనా ? సాధ్వియనియు, బతిప్రాణ రక్షణార్థమై యింతదూరము వచ్చెనని తలంచియైన నీవు గృపఁబూనకుంటివి కదా ! చతుర్దశభువనముల కరిగినను నాపతిని గాంచలేనా ? నాపతి మరలరాడా ? నాకుఁ బతియె లేడా? వైవస్వతా ! సమస్తాభీష్టప్రదంబును, సకలపాపశోషణంబును, సౌఖ్యశ్రీల కాలవాలంబును, సత్కీర్తిదాయకమును, ననర్ఘ్యరత్న మణిమయహారంబును, ముక్తిమార్గమును నగు బతిసేవయే నాకు లేకుండునా ? నాకుఁబతియే లేకుండనుండీ, సాధ్వినగు నేనట్టిదుఃఖమును బొందితినేని, యీలోకము లుండునా ? సూర్యచంద్రాదులుందురా ! నీలోకముండునా ? నీపరిపాలన ముండునా ; నీవుందువా ? సకలలోకములును నంధకారమయమై యొప్పవా ? ఒక్కపెట్టున జగత్ప్రళయము సంభవింపదా ? (ఇంచుకయూరకుండి) కృతాంతా ! కరుణారసార్ద్రహృదయుఁడవైతివేని నన్ను రక్షింపుము.

యము—(తనలో) ఆహా ! ఈమగువయొక్క తెగువ నేమనవచ్చును ? నేననేక సాధ్వీమణులను జూచితినిగాని యిట్టికాంతను నెందును వీక్షించియుండలేదు. ఈమహిమ పరమాశ్చర్యము ! ఈమ

చరిత్ర మనింద్యము. ఈమె గంభీరవాక్యములు నాకు మిగుల భయము గలిగించి దేహము గంపింపఁ జేయుచున్నవి. ఆహా! పతిభక్తికి మించిన దేదియును లేదుకదా! పతివ్రతాతిలకమగు నీమె నన్ను శపింపఁదలచినచో శపింపఁగలదు. భర్తృసేవాసక్తయగు నీమెకు దుర్ఘటమైనకార్య మేమియున్నది? యీమె పతిభక్తి నెంతయు గొనియాడ వలసియున్నది. అతివలకుఁ బతిభక్తియేకదా భూషణము. అదియేకదా మోక్షసంధానకర్త. అదియేకదా సర్వసౌఖ్యప్రదాయిని. అదియేకదా సమస్తపాప వినాశిని అదియేకదా సంతోషదాయకము; వేయేల నారీమణులకు బతిభక్తికిమించిన దేదియును లేదు. ఇంక నే నీమె విషయమై కాఠిన్యము వహింపరాదు.

(సావిత్రిని జూచి ప్రకాశముగా;

ఉ. అచ్చెరువయ్యె మదర్శితన ♦ యా! యిపుడాడిన మాటలెల్ల? నీ
సచ్చరితంబు నాకుఁగడు ♦ సంతసమిచ్చెను; సంశయింప కే
నిచ్చితిభర్తృజీవమును ♦ హీనకృపామతినై? ముదంబుతోఁ
జెచ్చెర నేగుమీ యికను ♦ జీవవిభుండట వేచియుండెడిన్.

మ. సరసీజేక్షణ నీదు ప్రాణవిభుఁడా ♦ చంద్రార్క తారావనీ
శరధిస్థాయిగ రాజ్యమేలుచు సమ♦స్తైశ్వర్యముల్ గాంచుచున్
జిరకీర్తిన్ గొనుచున్ మనంగలఁడువా ♦ నిన్ సంతతిన్ గాంచి భూ
వరసంఘంబునకెల్ల మేటియగుచున్ ♦ బల్మాటలిం కేటికిన్.

సావి—పితృపతీ! ఇప్పుడుగదా నేను ధన్యనైతిని. నీకరుణ నాపైఁబఱపుటచేఁగదా మరల నానాథుని గన నోచితిని. కాకున్నచో నిట్టిభాగ్య మెవ్వరైనఁ బొందియుండిరా?

యము—ఇందు నేఁజేసిన దేదియును లేదు. నిన్ను నీపతివ్రతాత్వమే కాపాడినది.

సీ॥ రాళ్ళువేయించి నారదునకుఁ బెట్టిన
యాయరుంధతిమించి యలరినావు
బఱగ ద్రిమూర్తులఁ బసిబాలురుగఁ జేసి
మించిన యనసూయ మించినావు
పరమపతివ్రతవైకాంతలకు నెల్లఁ
దలకట్టువౌచును దనరినావు
భవదీయగుణములు పడతులువీక్షించి
నేర్చుకొనుకరణి నెగడినావు
తే॥ గీ॥ మించి యిపుడు బ్రాణేశు రక్షించినావు
భవ్యభవదీయసత్కీర్తి వల్లిభువిని
నలుదెసలయందుఁ బ్రాకి యావలన విబుధ
లోక మావరించుచుఁగాక బ్రాకటముగ

నీవు దీర్ఘసుమంగలివై యుందువుగాక! నీవు నయనములు మూసికొని యుండుము. త్రుటిలో నీపతిసన్నిధి కనుగఁగలవు.

సావి—మహాత్మా! ధర్మస్వరూపుండవగు నీవొనర్చిన యీ యుపకారమునకు భవదీయ పాదపంకేరుహములకు నమస్కరించుచు నీయానతిం జేసి నిమీలితలోచన నగుచుంటిని.

(కన్నులుమూసుకొనును.)

యము—(తనలో) ఈమెను సత్యవంతునికడకు జేర్పవలయును.

(తెరవాలును.)

ఇది తృతీయాంకము.

సావిత్రి నాటకము.

చతుర్థాంకము.

రంగము—అరణ్యము

(మృతుండైన సత్యవంతుఁడు లేచియుండును.)

సత్య—ఆహా! నాకెంత దీర్ఘనిద్ర పట్టినది. తలనొప్పి బాధ భరింపఁజాలక నాసతీమణి యంకతలంబున శిరంబుచేర్చి యట్లేనిద్రించితిని. ఆనిద్రయందు నన్నెవరో యెక్కడికో యీడ్చుకొనిపోయినట్లుండెను. అమ్మయ్యా! ఇప్పటికిఁ బ్రాణములకు స్వస్థతఁజిక్కినది. (ప్రకాశముగా) సావిత్రీ! సావిత్రీ! (లేచి) తనయంకతలమున నన్నునిద్రింపఁజేసిన నాబహిఃప్రాణమేదీ? ఎచ్చటి కరిగియుండెనో! ఆమె నన్నిట్లువిడిచియాశ్రమంబున కరుగునా! అట్లెన్నటికిని జేయదు. సూర్యాస్తమయమునకుఁ బూర్వము నేనునిద్రించితిని. ఇప్పుడు మేల్కని. ఇప్పు డర్ధరాత్రిసమయ మైనది. ఆశ్రమమునకు మేమింతవరకును రాకయుంటిమని యంధులగు తల్లిదండ్రులెట్లు వందురుచున్నారో! అక్కటా! ఇప్పుడు నా సతి యెందరిగెనో! ఈఅర్ధరాత్రి సమయమున క్షేమమయ్యెనో! ఏపులివాతనైనఁ పడియుండునా? (ఆలోచించి) నిశ్చయముగా నట్లేయైయుండును. అయ్యో! తన్వీమణీ! నీవులేకున్న నాకీజగం బేల! ఈతనువేల! హా! పరమేశ్వరా! మమ్ముఁ బరీక్షించుట కెట్టి యిక్కట్లు సంప్రాప్తింపఁ జేయుచుంటివి! [సావిత్రినుద్దేశించి] హా! సతీ!

తే. గీ॥ పరిణయమునకు ముందె నీ ♦ ప్రాణమేను
బ్రోచియుంటిని పులిఁ జంపి ♦ పొలతిమిన్న!
యిప్పుడు నట్టిది యొనగూడ ♦ నేమిసేయ
జాలనైతి గదా యంచు ♦ జాలవగతు.

(ఇంచుక యూరకుండి ఆలోచించి) ఏమో గాని నా పతి నెట్టి
యుపాయమును మూడియుండునని తలంపను.

(సావిత్రి ప్రవేశము)

ఆహా యముని దయచేఁ ద్రుటిలో నిచటకుఁ జేరితిని.

సావి—(సత్యవంతుజూచి) అదుగో! నా ప్రాణనాథుఁడు లేచి నాకొర
కుఁ గాఁబోలు నిటు నటు జూచుచున్నాడు. ఆహా! ఇప్పుడు
నాకుగలుగుచున్న సంతోషమునకు మేరలేకున్నది.

తే. గీ. మరణమందినవారలు ♦ మరల బ్రతుక
గనుట గంటినే యెటనైన క్ష్మాతలమున
మరణమందిన నాథుఁడు ♦ మరలబ్రతుక
గంటి నేడు కృతాంతుని ♦ కరుణవలన.

కారణమునం జేసి నే నెంతయుఁ గృతార్థురాలను. (సత్యవంతుని
సమీపించి) నాథా! కుశలముగనుంటివా?

సత్య—హా! సావిత్రీ! వచ్చితివా! ఇంతవరకును నీవేమైతివోయనినీకై
సంతాపమందుచున్న నాకు నీవు నయనపర్వమొనర్చితివి. ఈ
యర్ధరాత్రిమున నీవెచ్చటికి బోయియుంటివి? నీయంకతలమున
శిరముజేర్చి శయనించిన తరువాత నేమిజరిగినదో యెఱుగను.

సావి—నాథా! నీకును నాకును నీ లోకమున ఋణము దీరినదనియు,
నిఁక బరలోకమునందె మనము సౌఖ్యమందుదమనియుఁ దలం
తినిగాని యట్లు జరుగలేదు. భగవంతుడు నాపాలిట నుండుటచే
మీఁదు సౌఖ్యము గలిగినది.

సత్య—(తనలో) నా నిద్రా సమయమునం నేదియో జరిగియుండును (ప్రకాశముగా) సతీ ! అదేమి ?

సావి—అదియంతయు సావధానముగ నాశ్రమమునం దెలిపెదను. మీతల్లిదండ్రులు మన యాలస్యమునకు మిగుల వగలం గొలుచుందురు. సత్వరముగం బోవలెను రమ్ము.

సత్య—మన యాశ్రమమునకుం బోవునప్పటికి, దెల్లవారును. రమ్ము.

(నిష్క్రమింతురు.)

రంగము—(ఆశ్రమమున ద్యుమత్సేనుడు.

భద్రాంగి—ప్రవేశము)

ద్యుమ—(భద్రాంగినిచూచి) సతీమణీ! భగవంతుడు మనయిరువురకును దృష్టిం బ్రసాదించి కొడుకును కోడలను జూడకుండం జేసినాం డేమి ! అక్కటా ! నిన్న మధ్యాహ్న సమయమునరణ్యమున కరిగిన సావిత్రిసత్యవంతు లింతవరకును నాశ్రమంబును జేరరైరి (భగవంతుని నుద్దేశించి) హా! పరమేశ్వరా !దృష్టిబ్రసాదించి యీాదీనుల గడగండ్లబాలు జేయనెంచితివా !

భద్రా—అయ్యో ! ఎన్నడును నట్లాశ్రమము విడిచియుండని వారే మైరోగదా. అక్కటా! మనకింక నేమిగతి ?

(నారదుండు బ్రవేశించును,)

నార—(స్వగతము) ఆహా ! సావిత్రిప్రభావమెంతయు మెచ్చవచ్చును కృతాంతునిగూడ గెలిచి పతిని రక్షించుకొనినదిగదా ! (ఎదుట జూచి) ఇదిగో! యముని వరప్రభావమువలన దృష్టిగలిగిసావిత్రి సత్యవంతు లింకను నాశ్రమంబున జేర లేదనియీావృద్ధదంపతులు విచారింపుచున్నారు, (సమీాపించును.)

ద్యుమ—నారదమునీంద్రా నమస్కరింపుచున్నాను. ఈదర్భాసనముపై నాసీనులగుడు.

నార—(ఆసీనుడగును.)

ద్యుమ—మహాత్మా తమరాక మాకుశుభప్రదమని తలంపుచున్నాను

తే. గీ. కొడుకు సావిత్రితో నిన్న ♦ నడవికరిగి
యింతవరకును రాకుండె ♦ నేమి కతమొ
ఘోరకాననమందునే ♦ క్రూరజంతు
వైన హానిగల్గించెనా ♦ యనుచు వగతు.

నార—రాజా ! నీవు వారింగూర్చి విచారింపనక్కరలేదు. వినుము నిన్నటితో నీతనయునకు బ్రహ్మయిచ్చిన యాయుర్దాయము తీరినది.

భద్రా }
ద్యుమ }—హా ! కుమారా!

నార—నృపాలా! చెప్పుచుండగనే యింత తొందరేల యిటువినుము. ఈసంగతి పుణ్యవతియగు సావిత్రికి దెలిపియుండుట చేతనే యామె నతని వెంట నరిగినది.

భద్రా—మునీంద్రా!ఇంకను వినవలసిన దేమున్నది. కడుపుదహించుకొనిపోవుచున్నది.

నార—చెప్పదలచినదంతయు జెప్పనిండు. అట్లాత డరణ్యమున కేగి కట్టెలను గొట్టుచుండగా దలనొప్పి బాధ సంభవింప దానిని భరింపజాలక సావిత్రియంకతలమున శిరముజేర్చుకొని నిద్రను మునింగెను.

ద్యుమ—అయ్యో అనిద్రయే దీర్ఘనిద్రయయ్యెనా? మునీంద్రా! హా ! భగవంతా ! దృష్టిప్రసాదంబి కొడుకునిటుచేసి నీవు సల్పినదం

టివా ? (నారదునిఁజూచి) తాపసోత్తమా ! తరువాత నేటు జరిగినది ?

నార—అప్పుడు కృతాంతుఁడరుదెంచి తన పాశములచే సత్యవంతుని శరీరమున జీవుని వెడలదిగిచి బంధించి తన నగరాభిముఖుఁడయ్యెను.

భద్రా—హా! కుమారా ! మాకింక దిక్కెవ్వరు? సావిత్రినేమిచేసితివి

ద్యుమ—సావిత్రియు నతనిమార్గమునే యనుసరించియుండును. (నారదునిఁజూచి) మునీంద్రా! ఇంక జెప్పనక్కర లేదు. మేమువారిని కలసికొనుట కాజ్ఞనీయుఁడు.

నార—దంపతులారా ! ఈయూరాట మేటికి ! సత్యవంతుని జీవములఁగొనిపోవుచున్న యమునివెంట సావిత్రి యమలోకమువఱకును నరిగి తన సుగుణములచే నాతని మెప్పించి ప్రథమవరమున మీకు దృష్టి గలుగునట్లును, రెండవవరంబున నశ్వపతి పుత్రవంతుఁడగునట్లును, వరంబు గ్రహించి తుదకు భర్తనుగూడ బునర్జీవితుఁడగునట్లు జేసికొనెను. వారిప్పుడేయిచ్చోట కరుదెంతురు.

ద్యుమ—తాపసోత్తమా! సంతోషము బట్టజాలక యున్నాను.

భద్రా—మునీంద్రా! సంతోషవార్త దెలిపిన మీకు నమస్కరింపుచున్నాను.

నార—(ఎదుటజూచి) అదిగో ! సావిత్రిసత్యవంతులు వచ్చుచున్నారు.

(సత్యవంతుడు, సావిత్రి ప్రవేశము.)

సత్య—తరుణీ! నీమహిమాతిశయమునఁకదా నేను జీవించితిని. అదిగో నారద మునీంద్రుకుగూడ వచ్చియున్నాడు. (సమీపించి) తండ్రీ నమస్కారములు

సావి—అత్తమామలారా ! వందనములు.

ద్యుమ—(సత్యవంతునిజూచి) వత్సా ! వచ్చితివా ! నాయనా ! మన మందఱము సావిత్రిచే రక్షింపబడితిమి. (సావిత్రినిజూచి)

తల్లీ! సావిత్రీ! నీకారణంబున నుభయకులములు బవిత్రములైనవి. అసమానాద్భుతమహిమ గలిగిన నీవు మాకుం గోడలవైతివని గర్వించుచున్నాను. నీవు నాథునివిషయమై యొనర్చిన మహిమయంతయు నారదునివలన నిప్పుడే వింటిని. మాకుం బుత్రభిక్షయు, దృష్టియు నీవలన గలిగినవి. నిన్నుం గొనియాడ నెవ్వరితరము!

నార— తల్లీ! సావిత్రీ!

సీ. దారిద్ర్యమునుబొంది ♦ తద్దయు నిడుమల
జెందుచుంటిరని వీ ♦ క్షించియుండి
వైవాహికంబైన ♦ వత్సరంబునకు ప
తికి మృతియుండుట ♦ దెలిసియుండి
వలదంచు పలుమారు ♦ పలికిన తల్లిదం
డ్రులమాట నొక్కింత ♦ తలపకుండ
సత్యవంతునిందప్ప ♦ సమ్మతింప మరొండు
వరునియంచు వచించి ♦ వానింగాంచి
తే. గీ. యంతకుని మెప్పుగైకొని ♦ యతనిగాచి
యత్తమామల యంధత ♦ నవనిబాసి
తల్లిదండ్రులవిషయమై ♦ తగినవరము
గాంచి యుభయకులముల ర ♦ క్షించితీవు.

లోకముననున్న జనరాండ్రు నిన్నుజూచి పతివ్రతాత్వమును నేర్చుకొందురుగాక! నీవు దీర్ఘసుమంగలివై యుందువుగాక!

సత్య— (ప్రక్కంజూచి) ఎవరో వచ్చుచున్నట్లున్నారు.

(పౌరులు కొందరు ప్రవేశింతురు)

పౌరు— తక్కినవారితో ఇదుగో! మన ద్యుమత్సేనమహారాజగారు! (ద్యుమత్సేనునిజూచి) మహారాజా! దండములు. మిమ్ము రాజ్యభ్రష్టులుగా జేసిన చిత్రకేతుని పరిపాలనము క్రూరముగా

సాలుడుటచే బ్రజలందఱేకమై యాతనిని బంధించి వధించిరి. ఇప్పుడు రాజ్యమరాజకమై యున్నది. దేవరవారు విచ్చేయ వలయును.

సత్య—మీరు పొండు. మేము రేపుదయముననే బయలుదేరి వచ్చెదము. మా రాక మంత్రుల కెఱిగింపుడు.

నార—(ద్యుమత్సేనునిం జూచి) రాజేంద్రా! వలసినవన్నియు నమకూడెను. ఇంక మీకు గావలసినదేమియు లేదు. నీవిక బురమున కరిగి సత్యవంతుని రాజ్యాభిషిక్తునిఁ జేసి భగవదారాధనయందు గాలము గడుపుము. అభిషేకోత్సవమునకు నేనుగూడ వచ్చెదను

ద్యుమ—మహాప్రసాదము! (అందఱు నిష్క్రమింతురు.)

రంగము:—(సాళ్వపురమున సభామందిరము సింహాసనముపై
సత్యవంతుఁడు సావిత్రి; ద్యుమత్సేనుఁడు నారదుఁడు
మంత్రులు మొదలగువారు ప్రవేశము)

ద్యుమ—కిరీటమును సత్యవంతుని శిరముపై బెట్టి వత్సా వంశక్రమానుగతమగు నీసాళ్వరాజ్యము ధర్మసంధుఁడవై చిరకాలము పరిపాలింపుము.

నార—

మ. ఇలనొందార్కసుధాంశుఁ డంబుజహితుం ♦ డిందార బృందారకా
వలి యొందార జెలంగుఁ సంతదసుకీ ♦ బాలింపు మీభూమి, ను
జ్జ్వలమాణిక్యకిరీటకుండల హిరా ♦ జన్నీల సంఖ్యాత కుం
తల విభ్రాజితపూర్ణచంద్ర నిభవ ♦ క్త్రాసత్యవంతాహ్వయా

ద్యుమత్సేనా! పరమేశ్వరుని కృపవలన మీయిష్టములన్నియు [illegible] రాజ్యము [illegible] లభించినది సత్యవంతుని [illegible] నొనర్చితిరి. ఇంక [illegible] వలసిన దేమున్నది.

ద్యుమ—

తే॥ గీ॥ ధరణి సావిత్రినామంబు ♦ స్మరణసేయు
నువిదలెల్ల పాపంబు బా ♦ యుదురుగాక !
నెలతసత్కీర్తి దిశలందు ♦ నిండుగాక !
ధర్మమే జయంబనుమాట ♦ తనరుగాక !

నార—తథాస్తు !

([illegible])

ఇది చతుర్థాంకము

సర్వము సంపూర్ణము.

చిత్రకేతుడు శహన—ఆదితాళము.

హోహోరా - క్రూరా - యీనాడే॥
పురమువిడిచి - వనులకేగ - వరసుతుడు, సతియు వెంటరా ॥హో॥
పదముపోయెనే - నాబలము తెలిసెనే, నీ
మదికిశాంత మొదవెనే - యిప్పుడు ॥హో॥

ద్యుమత్సేనుడు - బిళహరి—ఏకతాళము.

ధాతావ్రాత - దాటతరమే॥
భూతలపతినై - పాలదిననేను
ఖ్యాతిసివిడిచి - కానలకేగ నయ్యెగా ॥ధా॥
చిరతపాప్రియమువాడు - చిన్నశ్రీమరుడు
అరణ్యభూములందు - వాడు యెటులుండు ॥ధా॥

సావిత్రి - బేహాగ్—ఏకతాళము.

ఆహా! యీకాననంబు యెంతో - అందమై చెలువొందెగా
మహానందమయ్యెగా నా - మానసంబునకు ॥ఆ॥

సాకీ॥ అఖిలపుష్ప తరులతాశోభితంబు
విమల సలిలాసార కాసారయుతంబు

మిత్రము॥ కాంచగాంచమిగుల కనులపండువాయెగా
చూడజూడ వింత యెంతో దోచెగా ॥ఆ॥

సత్యవంతుడు - తోడి—ఆటతాళము.

ఎంతానివర్ణింతు నింతిచక్కదనము - నింతిచక్కదనము
కంతుచేతికతారి-వహ్వారెయీనారి- యీనాకీమణిసోయగమెంత
తాపసులకైన మదన - తాపముగల్గించి, సం
తాపమందగజేయు నీ - పద్మాక్షి ॥ఎంత॥

సత్యవంతుఁడు - కల్యాణి — ఏకతాళము

మదవతిగనగను మదనుం డదయుండై
పదును శరముల బఱపెడి - నాహృదయమున
ఈబాల - ఈగుణశీల - యీబేల యేభూ
పాలు గృహమును - పావనము సేయ నున్నదో ॥మ॥

సత్యవంతుఁడు - కన్నడ — ఆదితాళము.

మానిని నీవెవ్వతవే యను - మానము మాని వచింపఁగదే
కాననభూమికి నొంటరిగా - జనుదెంచితివే ॥మా॥
తల్లిదండ్రుల నామం బొప్పఁగ - దగ వినిపింపఁగదే
యుల్లము రంజిల్లెను నిను - జూడగను ॥మా॥

సావిత్రి - పూరికల్యాణి — ఏకతాళము.

నృపనందనా నీయుపకారము - మరువ జాలను
నిర్హేతుక కరుణబూని - నిజముగ బులివాతను
బడగ నుండిన - పడతిని - నక్క గాపాడితి వీవు ॥నృ॥
ఏమియొనర్చిన - దీఱదు - ఋణముగావున
నీమముతోడను - బ్రణుతి గావించెద ॥నృ॥

సత్యవంతుఁడు - నాదనామక్రియ — ఆది ఏకతాళము.

అవివాహితనని - యతివబల్కుట నాసకలిగె నాకిక
నాకోరిక తెలిపిన - నాతి యేమని తలచునో !
తెలుపక యుండిన మదనుని గెలుచుట యెటులో ॥అ॥

గాలవుడు - వసంత — ఏకతాళము.

మరునిగెల్చినవాడే - మహిని ధన్యుఁడగు సుమా
కాననమందున - కఠినతపము సేయగ నేల
తీర్థముల కేగగనేల - నిష్ఠలు జరుపగ నేల
గంగాదినదుల స్నాన - జపములేల ॥మ॥

సత్యవంతుడు - సారంగ—రూపక తాళము.

పోవుచుంటివా - పూర్ణేందువదనా
నీచెలి నీకును - నాసఖుడు నాకును
యింతలోన - నెడ - బాటు గావించిరి ॥పో॥
మరల నిను జూచు - భాగ్యము - తరుణీమణి - గలుగునో
గలుగదో ॥పో॥

సత్యవంతుడు—కల్యాణి.

ఓరి తులువా - రమ్మిక ॥ఓ॥
ఈశరమున - నీశిరము - ధరను - బడగా - సరగున జేసెద ॥ఓ
మున్నురాజ్యముగొని - వనమునకు మము - బాచితి వది
బాలక - యిప్పుడరుదెంచిన నిన్ గూల్చెద - చీల్చెద - వ్రేల్చె
దన్ ॥ఓ॥

సత్యవంతుడు—కమాచి

ఆనాడు-వనిలోన-గాంచిన-పూబోడి- నీనాడుమరల గంటిగా॥ఆ
ఈమె - యిటకు చనుదెంచుట కేమి కతము
నామానస మతి సంతోష మగ్న మయె ॥ఆ॥

ద్యుమత్సేనుడు—జంఝూటి.

ఇటురమ్మా నరపాలా ॥ఇ॥
పటుతర సౌఖ్యశ్రీల నందుచు - బాలించి - పుడమి - నేటికి
సంకటముల నందుచు నుంటివి ॥ఇ॥
రాజాధిరాజునయ్యు విరాజితలీల విను
బూజింప లేనయితిని - తగినవిధమున॥ ఇటు॥

అశ్వపతి.

చింతిలకయ్యా నీవు - స్వాంతమునందున॥
వంతలెవరికైన తప్పవు - మును భూకాంతు లందరిటు

చింతల జెంది - పిదప సౌఖ్యవంతులైరి ॥చిం॥
కలిమి లేములు - కావడికుండల వంటివని
తలపుము నీమదిని - లలితచరిత॥ చిం॥

అశ్వపతి - ఫీలు—రూపకము.

సావిత్రీవరమున - జన్మించెను నాకీబాల
భూవర దీనిని - కోడలుగా గొనుమా గుణశీల॥ సా॥
రాజపుత్రివని రాజసమూనక - రహిమీకున్
పరిచర్యలు సేయుచుండును - భక్తిని నెలమిన్॥ సా॥
సత్యవంతునే - మానసమున గోరిన సుదతీ
నిత్యము నాతనినే - స్మరియించెడు సుమతీ॥ సా॥
వనములనుంటి మటందును - వనటబొందకుము భూపా
కలిమి లేములు - కావడికుండలు - కులదీపా॥ సా॥

ద్యుమత్సేనుడు - కమాచి—ఆదితాళము.

నృపతీ వినుమా - నామతి॥ నృ॥
ఆగర్భశ్రీమంతురాలు - ఎండకన్నెరుగదు
కానలయందుండునే - ఆకులలములు భక్షించునె
నారచీరల దాల్చునె - దర్భశయ్యల మేనుజేర్చునె॥ నృ॥

సత్యవంతుడు.

భళిభళి - నాజన్మము - సఫలతజెందెను॥ భళి॥
కలికిమిన్నను - నాకొసగగ - యీ భూ
తలపతి యరుదెంచెను॥ భళి॥
నాడు వనిని చూచిన - నాటనుండియు పూ
బోడిపై హృదయము - జిక్కిన యందుకు,
నేడు నాకోరిక - దీరెను॥ భళి॥

సావిత్రి - సురట—రూపకతాళము.

జన్మమెత్తితిని జగ - న్మోహనాంగినై నిని॥
వను కోరిన సత్యవంతునే - చేకొన గంటిని

కోరిక సఫలంబయ్యెను - కుతలమునందు॥ ధ॥
ఈతని గొనిన భాగ్యమె - భాగ్యము॥ ధ॥
పతిపద సేవ సేయుచు - ధరియించెద॥ ధ॥

సావిత్రి - మోహన—ఆదితాళము.

మనోనాధ వనికి - నన్నుంగూడ గొనుము॥ మ॥
నినుగూడి నేవచ్చెద॥ మనో॥
అదియేమో నిను బాయ - మది యొప్పకున్నది నేడు॥ మ॥
సదమలాంగ నాముద్దు - సమ్మతి చెల్లింపుమా॥ మ॥

సావిత్రి - శంకరాభరణము.

వనవిచిత్రముల గనగా - మనమున కోరికయయ్యెగా॥ వ॥
వలదని పలుకగ - నోని ప్రాణేశ వారిజనేత్రా - సుగుణచరిత్రా - ధీజనమతిపాత్రా॥ వ॥

సత్యవంతుడు - ముఖారి—ఆదితాళము.

వలదు వలదు కలికి - వనికిరా నీవు॥
ఉపవాసంబున మది - నెంతయు డస్సితివి
పడుగైనగా వనిలో - నిడగగా జాలవు॥ వ॥

సావిత్రి - ముఖారి—రూపకతాళం.

నీపద సేవయు - శ్రీపతి సేవయు జేసెడినాకుగా
ఉపవాసశ్రమ కల్గునే - యుత్సాహంబును మదిని
ఆవిపినంబంతయు - తరులతలచే
దీపించునటంచును పిలిచిని - దోడ్కొని ప్రాణేశ॥ సీ॥

సత్యవంతుడు— కమాచి.

కనుగొనుమా రమణీయమణీ యీ వనరమణీయత॥ క॥
కనులలరగ - దట్టంబుగ నల్లుకొనిన ఘనలతలగా
మనమున కోల్లసము గొలిపెడు నటుకటపంబుల॥ క॥

చెంగు చెంగునదాటెను కురంగంబుల్ - వానిన్
భంగము నొందింపగ బరువెత్తెడి వ్యాఘ్రింబుల్ కను

సత్యవంతుడు-బిలహరి—ఆదితాళము

భరియింపగజాల - నాతల బాధ - పడతీ
కన్నులు గానగరావు - మిన్నుగనబడదు
నరములు లాగెడి - దేహము వడకెడి
ధ్వనివినిపించదు - కంఠము సన్నగిలె
నోటమాటరాదు - తలపో టధికమాయె ॥భ॥

సావిత్రి - బారువ—ఆటతాళము

హారమణా - నన్నుబాసి పోతివా - నన్నుబాసిపోతివా
పెండ్లినాటి మాటలెల్ల - మరచితో
అయ్యో - మరచితో - కుయ్యాలింపవే ॥హా॥
నీవు నన్నుబాసిన - తనువెట్లునిలచును
నీతలిదండ్రుల - సేవ లెట్లుమరచితివి ॥హా॥
నారదువాక్యములు - సత్యము లయ్యెను
ప్రాణవిభోనను - పాలించెడి వారెవ్వరు ॥హా॥

సావిత్రి - ఫీలు—ఏకతాళము

మందునిచ్చినా - ప్రాణవిభుని గాచెదవా
పుణ్యపురుషా - నీవెవ్వరవు ॥మం॥
తలబాధ యధికమై - ధరణి నొరగెను
కరుణదలంచి బ్రోవుమా కలుషరహిత ॥మం॥

యముడు - వసంత—ఆదితాళము.

ప్రాణము గాచెడివాడనుగాను - ప్రాణము తీసెడివాడన నేను
నేటితో దీరె - నీతనియాయువు
కాలుడనై - గ్రోలెడి కతమున
మృతనిజీవముల - హరియింపగవచ్చితి ॥ప్రా॥

సావిత్రి. నాదనామక్రియ.

పోవుచున్నావా - హా శమనా ! నాపతి ప్రాణంబులబాపి ॥పో॥
ఈవిధముగగ జేయగ - నీకును దగునే
భావింపవేలా - పడతికి నిది దుఃఖంబని ॥పో॥
సాధుగుణుడు - సచ్చరితుడు - సజ్జనసుతుడు
నాదయితుడు - నీకేమియెగ్గుసలి ॥పో॥
సతికిని - పతిలేని బ్రతుకు క్షితిలో వ్యర్థమనుచు
మతిదలపవదేల - గుణశీలా - యీబాలకు - దుఃఖము
కలిగింపగనేలా ॥పో॥

సావిత్రి - జంగ్లా.

శమనా - యిదితగునా - ధర్మముగనునా॥
ధర్మపురుషుడవు - ధర్మము దెలిసినవాడవు
పతివిరహితనుజేసి - యధర్మ...నగునువే ॥శ.
సుగుణశీలుడు - హరిచింతనాలోలుడు
సత్యవంతు నీతని - సరగున నేలుమా ॥శ

యముడు - కల్యాణి.

కడదూరం బిటువచ్చి - బడలితివి పడతీ॥
మరలుము - మరలుము - నాపలుకు నీపతీ॥
మర్త్యుల కగోచరమగు - నామార్గము
గననోచితి వీవు - సుదతీ ॥క॥
కర్మంబునకై కడువగవక
ధైర్యంబును బూనుము - తరుణీ ॥క॥
అగమ్యంబిటపైనుండిసమార్గం
దగునే నా తెగింపగ - మగువా ॥క॥

సావిత్రి - అఠాణా.

పతిపదసేవను ధన్యతనందితి నా
కతిసుకరంబగు నేమార్గంబయినన్ ।
ధర్మమూర్తి నీదర్శనమున - ధన్యతనందక
తగునె మరలిపోవగ - నావిభుని విడచి ॥పతి
పతు లెచ్చట నుందురు - సతులును నచ్చటనే
సతిముదమందుచు నుందురుగా పితృపతే ॥ప

యముడు - శహాన—ఆదితాళము.

ఇంతిమహిమ యద్భుతమ్మనించెగా
యద్భుతమ్మనించెగా - మహాద్భుతంబునించెగా
యసిపత్రి వనముదాటి , వైతరణి తరించెను
నాలోకంబున కరుదెంచెను ॥ఇం॥

యముడు—కళ్యాణి.

ఇచ్చితిరమణీ వచ్చెర నీపతిప్రాణములు - మెచ్చువచ్చె నీస
చ్చరితము నాకు ॥ఇ॥
అఖిలజీవుల - కంతకుడనై - దనరెడినాకే భీతిగొల్పితివి ॥ఇ॥
సద్గుణవంతుడు - సత్యవంతుడు
శాశ్వతజీవియై - బరగును భూమిని ॥ఇ॥
భాగ్యభోగములందుచు - సంతతిగాంచి
రాజిలగలడిక - రమణీయ "కళ్యాణి" ॥ఇ.

యముడు - హిందూస్థానికాపి—ఏకతాళము.

హరిణాక్షీ-నిను నతిసలుపగ, నాతరమే
క్షీణించుచు నుంటిన్ ॥
నీదగుచరితము - మోదముగూర్చెన్
సాదరమతి నీగతి - నాధుని బ్రతికించిన
సారసాక్షి నెందు గాంచనైతిన్ ॥హరి॥

సావిత్రి - భైరవి — ఆదితాళము.

ఇదె ప్రణుతి గొనుమ - ముదమున - నే నేగెన ధర్మపురుషా
గతించిన పతిని - బ్రతికించిని వీ
క్షితి నినుబోలిన - సతికలదే ॥ఇ॥

మంగళహారతి - మోహన — ఆదితాళము.

సారహారతీ - గైకోర - శ్రీపతి
ధీర - నందకుమార - దనుజవిదార - సువిచార ॥సా॥
గోపికాలోలా - సందీపిత - సుశీలా
పాపహర యదుదీప - గతసంతాప - సుకలాప ॥సా॥
పక్షిరాడ్గమనా - సురపక్షా రిపుదమనా
రక్ష - కమలదళాక్ష దనుజవిపక్షా శ్రీవక్షా ॥సా॥
సామగానలోలా - ధర - సీతారామయపాలా
భీమానుజప్రియకామా - సుగుణస్తోమా - నుతనామా ॥సా॥

శ్రీ వేమన గ్రంథాలయము
తెలప్రోలు

ఏలూరు శ్రీ పాండురంగ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడియె.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక	
పుస్తకం సంఖ్య	TPLA125B187
పుస్తకం పేరు	సావిత్రినాటకము
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	91
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	21,22
తయారు చేసినది	Ruksana
పేజీలు విడదీసినది	Ruksana
స్కాన్ చేసినది	Ch. Ramya
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good.